ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
5
మంగళవారం 4 మార్చి 2025



కందులను దించుకోని
వేర్‌హౌస్ అధికారులు
● నాలుగు రోజులుగా ఇబ్బందులు పడుతున్న డ్రైవర్లు

7



ప్రజా సమస్యలను
తక్షణమే పరిష్కరించాలి

● కలెక్టర్ చెరుకూరి శ్రీధర్



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ చెరుకూరి శ్రీధర్

కడప కలెక్టరేట్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల వ్యవస్థలో అర్జీలు సమర్పించే వారి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సభా భవనంలో జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున బాధితులు హాజరై తమ సమస్యల అర్జీలను కలెక్టర్‌కు, అధికారులకు అందజేశారు. వారి విన్నపాలను వింటూ తదుపరి చర్యలకై సంబంధిత అధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీదారుల సమస్యలపై అధికారులు స్వయంగా క్షేత్రస్థాయిలో విచారణ చేయాలన్నారు. పారదర్శకంగా పరిశీలన అనంతరం అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కారం ఉండాలన్నారు. పదేపదే బాధితులు కార్యాలయాలకు రాకుండా నిర్ణీత గడువులోగా పరిష్కారాలు చూపాలన్నారు. అంతకు ముందు జాయింట్ కలెక్టర్ అదితిసింగ్, పీజీఆర్ఎస్ నోడల్ అధికారి, జడ్పీ సీఈవో ఓబులమ్మ పీజీఆర్ఎస్ దరఖాస్తులపై జిల్లా అధికారులతో సమీక్షించారు.

ఈ సందర్భంగా కలెక్టర్‌కు రాయలసీమ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కుంచం వెంకటసుబ్బారెడ్డి ఫిర్యాదు చేస్తూ సిమెంట్ ఫ్యాక్టరీల వల్ల కాలుష్యం పెరిగిపోతోందని, కార్మికులకు కనీస వేతనం ఇవ్వడం లేదని అన్నారు. బద్వేలు నియోజకవర్గంలో మాదిగల అభివృద్ధికి సంబంధించి చెన్నంపల్లిలోని చర్మకారుల సొసైటీకి 18 ఏళ్ల కింద సర్వే నెంబరు 15/80లో కేటాయించిన స్థలంలో తమ పిల్లల భవిష్యత్తుకు సంబంధించి ఉపాధి శిక్షణకేంద్రాలు ఏర్పాటు చేయాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ గొడుగునూరు రాజశేఖర్ కలెక్టర్‌ను కోరారు. కడప నగరం నకాస్ లోని కాపు వీధిలో చెట్లు పెరిగి దోమలకు, పందులకు ఆవాసాలు అయ్యాయని జంగిల్ క్లియరెన్స్ చేయించాలని వరలక్ష్మి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరనాయుడు, జిల్లా అధికారులు ఆనంద్‌నాయక్, వెంకటపతి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా నలుమూలల నుంచి 126 ఫిర్యాదులు



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ అశోక్‌కుమార్

కడప క్రైం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా నలుమూలల నుంచి 126 ఫిర్యాదులు వచ్చాయని, వాటిని సంబంధింత పోలీసుస్టేషన్లకు బదిలీ చేశామని ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ తెలిపారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ప్రజలు ఇచ్చే ఫిర్యాదుల పట్ల సత్వరం స్పందించి చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలోని పెన్నార్ పోలీసు కాన్ఫరెన్స్ హాలులో సోమవారం జిల్లా నలుమూలల నుంచి విచ్చేసిన ఫిర్యాదుదారులతో ఎస్పీ స్వయంగా మాట్లాడి వారి సమస్యలను విని సంబంధిత అధికారులకు ఫోను ద్వారా ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాశ్‌బాబు, డీటీసీ డీఎస్పీ అబ్దుల్‌కరీం, మహిళా పీఎస్ డీఎస్పీ రమాకాంత్ పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఐటీ తాత్కాలిక అధ్యాపకుల
నిరసన

7



కబళిస్తోంది..!

● జిల్లాలో పెరుగుతున్న క్యాన్సర్ బాధితులు
● సగం జనాభా సర్వే.. 4,300 అనుమానిత కేసులు
● ఏప్రిల్ 30 వరకు సర్వే

చాపకింద నీరులా జిల్లాలో క్యాన్సర్ వ్యాపిస్తోంది. క్యాన్సర్ బాధితులను గుర్తించేందుకు గత నెల నుంచి వైద్యశాఖ ఇంటింటా సర్వే నిర్వహిస్తోంది. ఏప్రిల్ 30వ తేదీ వరకు జరిగే ఈ సర్వేలో ఇప్పటికే విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. జిల్లా వ్యాప్తంగా 18 ఏళ్లు పైబడిన వారు 16,42,016 మంది ఉన్నారు. నెల రోజులుగా 625 వైద్యబృందాలు క్యాన్సర్ బాధితులను గుర్తించే పనిలో పడ్డాయి. ఇప్పటి వరకు సర్వే చేసి 7,82,624 మందికి స్క్రీనింగ్ పరీక్షలు పూర్తి చేశారు. ఆ సర్వేలో ప్రధానంగా బీపీ, షుగర్, నోటి క్యాన్సర్, రొమ్ముక్యాన్సర్, గర్భాశయ ముఖద్వార స్ర్కీనింగ్ పరీక్షలు చేశారు. ఇప్పటికే 4,396 క్యాన్సర్ అనుమానిత కేసులు బయిట పడ్డాయి. మిగతా సగం జనాభా సర్వే పూర్తయ్యేనాటికి ఈ సంఖ్య 10 వేల వరకు చేరొచ్చని అంటున్నాయి. ఇవన్నీ అనుమానిత కేసులు మాత్రమే. వైద్యులు పూర్తిస్థాయిలో మరిన్ని పరీక్షలు నిర్వహిస్తే కానీ క్యాన్సర్ బాధితులు ఎంతమంది ఉన్నారనే వాస్తవ సంఖ్య బయటపడదు.

కడప కలెక్టరేట్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా నిర్వహించిన సర్వేలో క్యాన్సర్ బాధితుల సంఖ్య పెరుగుతున్నట్లు తేలడంతో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తం అయింది. ప్రపంచ వ్యాప్తంగా ఏటా నమోదవుతున్న క్యాన్సర్ కేసుల్లో మరణాల సంఖ్య కూడా 10 శాతం భారతీయులదే ఉండడం ఆందోళన రేకెత్తిస్తోంది. అందులో నమోదవుతున్న క్యాన్సర్ కేసుల్లో 44 శాతం ఐదు రకాల కేసులకు సంబంధించినవిగా గుర్తించారు. మన జిల్లాలో పొగాకు ఉత్పత్తుల వాడకం వల్ల (పాన్‌పరాగ్, గుట్కా, కిల్లీ, తంబాకు, ధూమపానం) నోటి క్యాన్సర్ అనుమానితులు 2,120 మంది ఉండగా, రెండవ స్థానంలో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌తో 1,181 మంది మహిళలు ఇబ్బంది పడుతున్నట్లు తేలింది.

పుట్టిన బిడ్డలకు పాలివ్వని మోడరన్ తల్లుల శాతం పెరుగుతోంది. అందం చెదురుతుందని బిడ్డకు తల్లిపాలు ఇవ్వకపోవడం, గర్భనిరోధక మందులు అధికంగా వాడటం వల్ల రొమ్ముల్లో గడ్డలు కట్టి 1,095 మంది మహిళలు క్యాన్సర్ బారిన పడ్డారు. వీరంతా 30 ఏళ్లు పైబడిన మహిళలని సర్వేలో తేలింది. ఇకపోతే బీపీ బాధితులు 54,015 మంది, షుగర్ బాధితులు 56,069 మంది ఉన్నారని తేలింది. ఈ కేసుల్లో ఎక్కువగా 18-50 ఏళ్లలోపు వారే ఉండడం గమనార్హం. ఇక పోతే సర్వికల్ క్యాన్సర్ సర్వే విషయంలో మహిళల నుంచి సమాధానాలు ససేమిరా అంటుండడంతో వైద్య సర్వే బృందాలు తిప్పలు పడుతున్నట్లు తెలుస్తోంది. ముందస్తుగా క్యాన్సర్ బాధితులను గుర్తించి మొగ్గ దశలోనే మెరుగైన చికిత్స ద్వారా ఆరోగ్య భరోసా కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్న సర్వేలో ప్రజలు సరైన సమాచారం అందించాల్సిన అవసరం ఉంది. లేదంటే ఆరోగ్య పరంగా.. ఆర్థికంగానూ ప్రజలు నష్టపోయే అవకాశం ఉంది.

సగం మందికి స్ర్కీనింగ్ పరీక్షలు పూర్తి చేశాము



జిల్లాలో సర్వే ద్వారా క్యాన్సర్ వ్యాధి లక్షణాలు ఉన్న వారిని గుర్తిస్తున్నాం. ఇప్పటి వరకు 18 ఏళ్ల పైబడిన వారు 16.42 లక్షల మంది ఉన్నారు. అందులో సగం మందికి స్ర్కీనింగ్ పరీక్షలు చేశాం. అనుమానిత కేసులు 4,300 వరకు గుర్తించాం. వచ్చే నెలాఖరు వరకు సర్వే జరగనుంది. వైద్య సిబ్బంది నిర్వహించే సర్వేకు ప్రజలు సంపూర్తిగా సహకరించాలి. సర్వే పూర్తయ్యే నాటికి క్యాన్సర్ అనుమానితుల సంఖ్య రెట్టింపు అయ్యే అవకాశాలు ఉన్నాయి. క్యాన్సర్ ఉంటే మెరుగైన వైద్యంతో నయం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోనుంది. అయితే అనుమానిత కేసులను మెడికల్ ఆఫీసర్లు, ఫ్యామిలీ ఫిజీషియన్లు, రిమ్స్ వైద్యాధికారులు ఫిల్టర్ చేసిన మీదట క్యాన్సర్ నిర్ధారణ ఉంటుంది. అప్పటి వరకు అనుమానిత కేసులు క్యాన్సర్ కేసులు కాదు.

- డాక్టర్ రమేశ్, సర్వే ప్రాజెక్ట్ అధికారి

బాల్య వివాహాలు సాంఘిక దురాచారం



బాల్యవివాహాలను జరగనివ్వం అంటూ ప్రతిజ్ఞ చేయిస్తున్న జాయింట్ కలెక్టర్ అదితిసింగ్

కడప కలెక్టరేట్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు సాంఘిక దురాచారమని, వీటిని అరికట్టేందుకు అందరూ సహకరించాలని జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సభాభవన్‌లో మహిళా స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం వారోత్సవాలలో భాగంగా బాల్యవివాహ రహిత ఆంధ్రప్రదేశ్‌గా తీర్చి దిద్దుతామని అందరితో జేసీ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్యవివాహాల వల్ల బాలికలకు అందాల్సిన విద్య, రక్షణ, ఆరోగ్యం మరియు అభివృద్ధికి ఆటంకం కలుగుతుందన్నారు. వారి కలలను సాకారం చేసుకునే అవకాశం దూరం అవుతుందన్నారు. ఇలాంటి వివాహాలను ప్రతి ఒక్కరూ అడ్డుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో విశ్వేశ్వర నాయుడు, మహిళా స్త్రీ శిశు సంక్షేమ శాఖ పీడీ శ్రీలక్ష్మి, జడ్పీ సీఈవో ఓబులమ్మ, డీఆర్డీయే పీడీ ఆనంద్ నాయక్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కొవ్వొత్తుల ర్యాలీ

జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ మరియు సాధికారిత అధికారి శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో సోమవారం కడపలో బాల్యవివాహాల నియంత్రణకు కొవ్వొత్తుల ర్యాలీ జరిగింది. హిందూ ముస్లిం క్రిస్టియన్ మత పెద్దలు, మహిళా సంఘాల మహిళలతో కలెక్టరేట్ నుంచి మహవీర్ సర్కిల్ వరకు బాల్య వివాహ రహిత జిల్లా చేయాలంటూ పిలుపు నిస్తూ కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు.



ర్యాలీగా వస్తున్న అధికారులు, మహిళలు, మత పెద్దలు

ఓ కుటుంబ సభ్యుడిని కోల్పోయాం

● పీరయ్య భౌతికకాయాన్ని సందర్శించి.. పాడె మోసిన నందమూరి రామకృష్ణ



పీరయ్య భౌతిక కాయానికి టీడీపీ కండువా కప్పుతున్న నందమూరి రామకృష్ణ

కడప మారుతీనగర్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): నందమూరి బాలకృష్ణ అభిమాన సంఘం జిల్లా అధ్యక్షుడు, తెలుగుదేశం పార్టీకి కరుడుగట్టిన అభిమాని, ఉపాధి హామీ కౌన్సిల్ మాజీ సభ్యుడు పోతుగంటి పీరయ్య ఆకస్మిక మృతి షాక్‌నకు గురిచేసిందని నందమూరి రామకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన మృతితో ఓ కుటుంబసభ్యుడిని కోల్పోయామని అన్నారు. ఇటీవల అనారోగ్యంతో హైదరాబాద్‌లోని స్టార్ హాస్పిటల్‌లో వైద్యసేవలు పొందుతూ పీరయ్య మృతిచెందిన సంగతి తెలిసిందే. ఆయన భౌతికకాయాన్ని సోమవారం కడప రవీంద్రనగర్‌లోని నివాసం వద్దకు తీసుకు వచ్చారు. ఉదయం నుంచి అంత్యక్రియలు జరిగే వరకూ టీడీపీ, బాలకృష్ణ అభిమానుల సందర్శనార్థం ఉంచారు. టీడీపీ నేతలు పుత్తా నరసింహారెడ్డి, పీఎస్ అమీర్‌బాబు, హరిప్రసాద్, గోవర్ధన్‌రెడ్డి, సురేశ్‌నాయుడు, యాటగిరి రాంప్రసాద్, వికాస్ హరికృష్ణ, ఆమూరి బాలదాసు, శివకొండారెడ్డి, జనసేన నేతలు సుంకర శ్రీనివాస్, జీవీ రమణ, బాలకృష్ణ అభిమాన సంఘం నాయకులు నివాళి అర్పించారు.

సినిమా హీరో నందమూరి బాలకృష్ణ కొత్త చిత్రం 'అఖండ తాండవం' షూటింగ్‌లో భాగంగా హిమాలయాలలో ఉండడంతో ఆయన సోదరుడు నందమూరి రామకృష్ణ పీరయ్య అంత్యక్రియలకు హాజరయ్యారు. పీరయ్య కుటుంబసభ్యులను ఆయన పరామర్శించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మా తండ్రిగారైన నందమూరి తారకరామారావు వీరాభిమానిగా ఉంటూ.. టీడీపీ ఆవిర్భావం నుంచి కరుడుగట్టిన అభిమానిగా తదుపరి మా బాలయ్య వీరాభిమానిగా ఎనలేని సేవలందించారన్నారు. సోదర సమానులైన పీరయ్య మృతితో కుటుంబ సభ్యుడిని కోల్పోయినట్లయిందన్నారు. ఎన్నికల ముందు నారా చంద్రబాబును అన్యాయంగా అరెస్ట్ చేసి 53 రోజుల పాటు జైలులో ఉంచినపుడు పీరయ్య నల్లదుస్తులు ధరించి, కాళ్లకు చెప్పులు వేసుకోకుండా పార్టీ కోసం కష్టపడ్డారన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. అనంతరం రవీంద్రనగర్‌లోని నివాసం నుంచి ప్రారంభమైన పీరయ్య అంత్యక్రియలలో నందమూరి రామకృష్ణ పాల్గొని కొద్దిదూరం పాడెమోశారు. క్రిష్ణా థియేటర్ సమీపంలో గల యాకూబ్‌సాబ్ మసీదు శ్మశాన వాటికలో అంత్యక్రియలు పూర్తి చేశారు.

రూ.650 కోట్లతో భారీ పరిశ్రమలు

● ఫేజ్-1లో రూ.1654 కోట్లతో కొప్పర్తిలో మౌలిక వసతులు
● 2026 నాటికి విమానాశ్రయం అభివృద్ధిపనులు పూర్తి




కొప్పర్తి పారిశ్రామికవాడ కడపకు మాత్రమే కాదు.. సీమకే గుండెలాంటిది. అలాంటి చోట తొలి విడతలో రూ.1,654 కోట్లతో 2096 ఎకరాలను అభివృద్ధి చేయనున్నారు. ఇందులో భాగంగా ఇక్కడ పరిశ్రమలకు అవసరమైన రోడ్లు, విద్యుత్, వాటర్ ఇతర మౌలిక వసతులన్నీ కల్పిస్తారు. పైపులైను కోసమే రూ.200కోట్లు ఖర్చు పెట్టనున్నారు. వసతులు ఉంటే పరిశ్రమలు క్యూ కడతాయి. కడప నుంచి విమానయానం, రైల్వే సదుపాయాలు ఉన్నాయి. మెట్రోసిటీలైన బెంగళూరు, చెన్నై కడపకు దగ్గరలో ఉన్నాయి. ఇటు చెన్నై ఎయిర్‌పోర్టు, అటు క్రిష్ణపట్నం పోర్టు అందుబాటులో ఉండడంతో పరిశ్రమల ఏర్పాటుకు ఇక్కడ అనువైన వాతావరణం ఉంది. కొప్పర్తిలో మౌలిక వసతులు పూర్తయితే పరిశ్రమల ఏర్పాటుకు మార్గం సుగమం అవుతుంది. రూ.650 కోట్లతో నాలుగు భారీ పరిశ్రమలు ఏర్పాటు చేయనున్నట్లు ప్రభుత్వం తెలిపింది.

(కడప-ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులకు రానున్న రోజుల్లో ఉపాధి కల్పించడంతో పాటు జిల్లా అభివృద్ధికి కీలకం కానున్న కొప్పర్తి రూపురేఖలు త్వరలో మారను న్నాయి. కేంద్రంలో, రాష్ట్రంలో కూటమి సర్కారు ఉండడంతో తాత్కాలిక ప్రయోజ నాలు కాకుండా దీర్ఘకాలిక ప్రయోజనాలు, ఉపాధి అవకాశాలపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఇక స్మార్ట్‌సిటీలో భాగంగా కొప్పర్తిని రూ.2,300 కోట్లతో అభివృద్ధి చేయనున్నారు. తొలి విడతలో రూ.1,656 కోట్లతో 2,596 ఎకరాలను అభివృద్ధి చేయనున్నారు. ఈ మేరకు ప్రభుత్వం రూపొందించిన సోషల్ ఎకనామిక్స్ సర్వే నివేదికలో జిల్లాలో చేపట్టిన అభివృద్ధి, గ్రోత్ రేటును వివరించింది.

జిల్లాలో అపారమైన నిక్షేపాలు ఉన్నాయి. పరిశ్రమలకు అనువైన వాతావరణంతో పాటు పర్యాటకం, హార్టికల్చర్‌కు అనువైన వాతావరణం ఉంది. సొంత జిల్లావాసి జగన్ ఐదేళ్లు అధికారంలో ఉన్నప్పటికీ ఆ పవర్‌ను జిల్లా అభివృద్ధికి ఉపయోగించుకోలేక పోయారు. బటన్ నొక్కుడు ఇతరత్రా వాటితోనే సరిపెట్టుకు న్నారు. అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్లుగా.. వైసీపీ హయాం లో జిల్లా పరిస్థితి ఉండేది. అయితే ప్రస్తుతం కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ఉండటంతో జిల్లా రూపు రేఖలు మారే పరిస్థితులు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

గండికోటలో..



ఇక గ్రాండ్ కెనాన్‌గా పేరొంది పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తున్న గండికోటలో రూ.2500 కోట్లతో ప్రముఖ హోటల్ దిగ్గజం ఒబెరాయ్ రిసార్ట్స్‌ను 40 ఎకరాల్లో ఏర్పాటు చేయనుంది. అలాగే రూ.77.0 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నారు. గండికోటను అద్భుతమైన పర్యాటక ప్రాజెక్టుగా తీర్చిదిద్దనున్నారు. పర్యాటకరంగాన్ని అభివృద్ధి చేసేందుకు సీప్లేస్ తరహాలో ఇక్కడ అభివృద్ధి కార్యక్రమాలు చేపడతారు.



విమానాశ్రయంలో..

కడప విమానాశ్రయంలో చేపడుతున్న అభివృద్ధి పనులు 2026 నాటికి పూర్తి చేస్తామని సంబంధిత అధికారులు వెల్లడించారు. ఇప్పటికే జిల్లాలో విమాన ప్రయాణం చేసేవారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఇక్కడి అభివృద్ధి పనులు పూర్తయితే ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. ఇక జిల్లాలో ఐరన్‌ఓర్, యురేనియం ఇతర నిక్షేపాలు పుష్కలంగా ఉన్నాయి. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ఏడాదికి రూ.20వేల చొప్పున ఉమ్మడి జిల్లాలో 4.80లక్షల మందికి లబ్ధి చేకూరనున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. సుమారు 14వేల మంది కౌలురైతులకు ఈ పథకం వర్తించనుంది. జిల్లాలో ఎర్రచందనం పరిరక్షణ కోసం చర్యలు చేపడుతున్నారు. డిస్ట్రిబ్యూటరీ కెనాల్‌ను పూర్తి చేయనున్నట్లు ప్రభుత్వం విడుదల చేసిన సోషల్ ఎకనామిక్స్ సర్వే నివేదికలో వెల్లడించారు.

అర్హులందరికీ బ్యాంకర్లు రుణాలివ్వాలి

● కలెక్టర్ చెరుకూరి శ్రీధర్

కడప కలెక్టరేట్, మార్చి3(ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో ఆధునాతన సాంకేతికతకు అవసరమైన పెట్టుబడుల కోసం రైతులకు రుణ సహకారం అందించాలని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ బ్యాంకు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ అధ్యక్షతన డిస్ట్రిక్ట్ లెవల్ కమిటీ (డీఎల్‌సీ) బ్యాంకర్ల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జిల్లాలోని అన్ని బ్యాంకులకు నిర్దేశించిన పలు రకాల రుణ లక్ష్యాలు, సాధించిన ప్రగతిని ఆయా బ్యాంకు ప్రతినిధులతో కలెక్టర్ సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ బ్యాంకర్లు సమర్థవంతంగా పనిచేస్తేనే ఆర్థిక వ్యవస్థ మరింత ధృఢంగా ఉంటుందన్నారు. జిల్లా ఆర్థికాభివృద్ధిలో మహిళా సంఘాలను భాగస్వామ్యం చేయాలన్నారు. సేంద్రీయ సాగుబడిలో పండించిన పంటల దిగుబడులకు మంచి ఆదరణ లభిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో నాబార్డు ఏజీఎం విజయవిహారి, రిజర్వుబ్యాంకు ఎల్డీఓ నవీన్‌కుమార్, కెనరా బ్యాంకు ఏజీఎం మురళీ మోహన్, ఎస్బీఐ ఏజీఎం వాణీకిశోర్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమిత స్థలంలో బోర్డుపాతారు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



ఆక్రమిత స్థలంలో రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన బోర్డు

కడప, మార్చి 3(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలో నీటి మునక భూమిలో ఎట్టకేలకు రెవెన్యూ అధికారులు సోమవారం సాయంత్రం బోర్డు పాతారు. చిన్నచౌకు సర్వేనెం.955లో 23 సెంట్ల ప్రభుత్వ భూమి నీటి మునకగా ఉంది. అయితే ఈ భూమి ఆక్రమణకు గురైంది. ఈ విషయాన్ని ఆంధ్రజ్యోతి 'రూ.10కోట్ల ప్రభుత్వ స్థలం కబ్జా' అంటూ ఆదివారం కథనం ప్రచురించింది. దీనిపై స్పందించిన రెవెన్యూ అధికారులు సోమవారం 'ఇది ప్రభుత్వ స్థలం' అంటూ బోర్డు పాతారు.

రంజాన్ వేళలు



	ఇఫ్తార్ (మంగళవారం సాయంత్రం)	సెహరీ (బుధవారం ఉదయం)
కడప	6.29	5.14
ప్రొద్దుటూరు	6.30	5.18

ఎన్‌ఏటీఎస్‌కు విశేష స్పందన

● పట్టణ ఎస్‌హెచ్‌జీ పట్టభద్రులకు శిక్షణ ● అప్రెంటిషిప్‌లకు దరఖాస్తుల వెల్లువ ● లక్ష్యం 2150... దరఖాస్తులు 2986



దరఖాస్తులు స్వీకరిస్తున్న మెప్మా సిబ్బంది (ఫైల్)

కడప ఎన్టీఆర్ సర్కిల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): కేంద్ర విద్యామంత్రిత్వ శాఖ అమలు చేస్తున్న జాతీయ అప్రెంటిషిప్ శిక్షణ పథకం(ఎన్‌ఏటీఎస్)కు విశేష స్పందన లభిస్తోంది. ఈ పథకం ద్వారా నగర, పట్టణాల్లోని స్వయం సహాయక సంఘాల్లో 2021 తర్వాత పట్టభద్రులైన సభ్యులు, వారి పిల్లలకు వృత్తి నైపుణ్య, జీవన నైపుణ్య శిక్షణ అందించేందుకు కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా), ఆశా సొసైటీ సహకారంతో 2024-25 సంవత్సరానికి అప్రెంటిషిప్ ద్వారా లబ్ధి చేకూర్చేందుకు ఒప్పందం చేసుకుంది.

జిల్లాలోని కడప నగరంతో పాటు జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, పులివెందుల, బద్వేలు, మైదుకూరు, ఎర్రగుంట్ల, కమలాపురం పట్టణాల్లో 2,150 మంది డిగ్రీ చదివిన స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులు, వారిపిల్లలకు అవసరమైన వృత్తి జీవన నైపుణ్య శిక్షణ అందంచాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. ఈ మేరకు ఈ ఏడాది ఫిబ్రవరి 28 వరకు దరఖాస్తులను స్వీకరించారు. ప్రస్తుతం ఎటువంటి ఉద్యోగం ఉపాధి లేకుండా ఇంట్లో ఖాళీగా ఉన్నవారు అర్హులుగా పరి గణించారు. దీంతో 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ విద్య అర్హత ధ్రువపత్రాలతో పాటు ఆధార్ కార్డు, ఆధార్‌తో లింక్ అయిన మొబైల్ ఫోన్ నెంబర్, బ్యాంకు ఖాతా, ఇ-మెయిల్ ఐడీలాంటి వివరాలతో దరఖాస్తులను స్వీకరించారు. ఈదరఖాస్తులు మెప్మా ఎస్ఏ ల్ఎఫ్ ఆర్పీ, కమ్యూనిటీ ఆర్గనైజర్ ద్వారా వెబ్‌సైట్‌లో నమోదు చేశారు.

లక్ష్యానికి మించి దరఖాస్తులు

ప్రభుత్వం కడప జిల్లాకు సంబంధించి 2150 మందికి శిక్షణ ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించింది. కానీ క్షేత్రస్థాయిలో 2986 మంది దరఖాస్తులను సమర్పించారు. బద్వేలు పట్టణ ప్రాంతంలో 300 మందికి శిక్షణ ఇవ్వాల్సి ఉండగా 362 మంది, జమ్మలమడుగులో 150 మందికి 183 మంది, కడప నగరంలో 500 మందికి 940 మంది, ప్రొద్దుటూరు పట్టణంలో 300 మందికి 462, పులివెందులలో 300 మందికి 339 మంది, మైదుకూరులో 300 మందికి 368 మంది, ఎర్రగుంట్లలో 150 మందికి 160 మంది, కమలాపురంలో 150 మందికి గాను 172 మంది దరఖాస్తులు సమర్పించారు.

ప్రయోజనాలు ఇవే...

శిక్షణ అనంతరం కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ, జాతీయ నైపుణ్య అభివృద్ధి సంస్థ, సంబంధిత పరిశ్రమ నుంచి ధ్రువపత్రాలు జారీ చేస్తారు. వీటి ఆధారంగా ఉద్యోగ అవకాశాలు పొందవచ్చు. అదేవిధంగా శిక్షణ కంపెనీ లేదా ఏడాది పాటు ప్రతినెల రూ.4500 ఉపకారవేతనం అందజేయడం జరుగుతుంది.

దరఖాస్తులకు మంచి స్పందన

ఎన్‌ఏటీఎస్ అప్రెంటి షిప్‌కు సంబంధించి దరఖాస్తులు స్వీకరిం చాం. లక్ష్యానికి మించి దరఖాస్తులు అం దాయి. డిగ్రీ రెగ్యులర్ మోడ్‌లో ఉత్తీర్ణు లైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించడం జరిగింది.

-ఎం.కిరణ్‌కుమార్, పీడీ మెప్మా

ట్రిపుల్‌ఐటీ తాత్కాలిక అధ్యాపకుల నిరసన

● 110 జీఓ ప్రకారం వేతనం ఇవ్వాలని డిమాండ్



అకడమిక్ బ్లాక్ వద్ద నిరసన తెలుపుతున్న తాత్కాలిక అధ్యాపకులతో చర్చిస్తున్న డైరెక్టర్ కుమారస్వామి గుప్త

వేంపల్లె, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో విద్యాబోధన చేస్తున్న తాత్కాలిక అధ్యాపకులు క్యాంప స్‌లో రోడ్డెక్కారు. ఏడేళ్లుగా పనిచేస్తున్న అరకొర వేతనమే ఇస్తున్నారని.. 110 జీఓ అమలు చేసి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలనే డిమాండ్ చేశారు. సోమవారం ఉదయం ట్రిపుల్‌ఐటీ ఓల్డ్ క్యాంపస్ సమీపంలో ఉన్న ఆర్జీయూకేటీ ఎంబ్లమ్ వద్ద ఫ్లకార్డులతో నిరసన తెలిపారు. గెస్ట్‌ఫ్యాకల్టీ నుంచి కాంట్రాక్టు అధ్యాపకులుగా మార్చి 110 జీఓ ప్రకారం రూ.33వేల వేతనం, ఏడాదికి రూ.1000 ఇన్సెంటివ్ జమ చేసి వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అసోసియేషన్ ప్రతినిధి నజీర్ ఏడేళ్లుగా పనిచేస్తున్నా తమకు ఆర్జీ యూకేటీ తమకు తీరని అన్యాయం చేస్తోందని, చాలీచాలనీ జీతంతో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న డైరెక్టర్ కుమారస్వామి గుప్త ధర్నా చేస్తున్న తాత్కాలిక అధ్యాపకులతో చర్చించారు. సమస్యను రిజిస్ట్రార్ దృష్టికి తీసుకెళ్లి పలు మార్లు డైరెక్టర్ నచ్చజెప్పినా నిరసన కొనసాగించారు. సాయంత్రం రిజిస్ట్రార్‌తో ఫోన్‌లో మాట్లాడించారు. సాంకేతిక విద్య ప్రిన్సిపల్ సెక్రటరీ కోన శశిధర్ దృష్టికి తీసుకెళ్లి త్వరలో జరగబోయే గవర్నింగ్ కౌన్సిల్ మీటింగ్‌లో సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో నిరసనను తాత్కాలికంగా విరమించారు.

ఇష్టానుసారం పదోన్నతులు.. ఖాళీలు లేకున్నా పోస్టింగులు

● కడప పూర్వ వైద్య ఆరోగ్య శాఖ రీజినల్ డైరెక్టర్ నిర్వాకం
● ఆలస్యంగా గుర్తించి విచారణకు ఆదేశించిన ప్రభుత్వం

కలికిరి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో పర్యవేక్షణ గాలికొదిలేసిన కారణంగా అన్ని స్థాయిల్లోనూ అధికారులు కూడా ఇష్టారాజ్యంగా వ్యవహరించిన ఉదంతాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. వివిధ శాఖల్లో అధికారులు అన్ని రకాల నియమాలను తుంగలో తొక్కి, అక్రమాలకు పాల్పడిన వైనాలు కూడా వెల్లడవుతున్నాయి. తాజాగా గతంలో కడప వైద్య ఆరోగ్య శాఖలో రీజినల్ డైరెక్టరుగా పనిచేసిన డాక్టర్ కేవీఎస్ఎస్ అనిల్‌కుమార్ పోస్టులు ఖాళీ లేకున్నా.. కొంత మందికి అక్రమంగా ఉద్యోగాలు ఇచ్చిన వైనాన్ని ప్రభుత్వం పసిగట్టింది. ఈ అడ్డదిడ్డమైన వ్యవహారం కారణంగా ప్రమోషన్లు పొందిన 9 మంది ఉద్యోగులు ఇప్పటికీ జీతాలు రాక సమస్యల్లో చిక్కుకోవడం కొస మెరుపు. ఈ మొత్తం వ్యవహారంపై పూర్తి స్థాయిలో విచారణ జరిపించడానికి ప్రాథమికంగా సోమవారం సదరు ఆర్డీ అనిల్‌కుమార్‌కు సంజాయిషీలు కోరుతూ నోటీసులు జారీ చేసింది.

కడప వైద్య ఆరోగ్యశాఖ రీజినల్ డైరెక్టరు పరిధిలోని నంద్యాల జిల్లాలో 2023లో ఈ వ్యవహారం చోటు చేసుకుంది. నంద్యాల జిల్లాలో వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న 9 మంది ఉద్యోగులకు ఆర్డీ అనిల్‌కుమార్ ఎంపీహెచ్ఎస్, స్టాఫ్ నర్సులుగా అక్రమంగా పదోన్నతులు కట్టబెట్టారు. అంతటితో ఆగకుండా వారికి జిల్లాలోని వివిధ పీహెచ్‌సీల్లో పోస్టింగులిచ్చారు. ఈమేరకు పదోన్నతులు పొందిన వారు కూడా కొత్త స్థానాల్లో చేరిపోయారు. అయితే తీరా జీతాలు చెల్లించాల్సి వచ్చే సరికి ఆయా స్థానాల్లో అసలు ఖాళీలు లేవని గుర్తించారు. ఫలితంగా జీతాలు లేకుండానే వీరంతా ఏళ్ల తరబడి పనిచేయాల్సి వచ్చింది.

ప్రస్తుతం మంగళగిరిలోని వైద్యశాఖ కమ్యూనిటీ హెల్త్, కుటుంబ సంక్షేమ శాఖ ఎంహెచ్ఎన్ విభాగంలో అడిషనల్ డైరెక్టరుగా పనిచేస్తున్న అనిల్‌కుమార్ నిర్వాకం వెలుగులోకి వచ్చింది. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి క్రమశిక్షణా చర్యలు తీసుకోవాల్సి వున్నందున 15 రోజుల్లోగా అభియోగాలపై సంజాయిషీ సమర్పించుకోవాలని వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి డాక్టర్ మంజుల డి హోస్‌మణి సోమవారం ఆదేశాలు జారీ చేశారు.

పదోన్నతులు పొందిన వారు

ఉన్నతాధికారుల అనుమతులు లేకుండా.. పద్ధతులు పాటించకుండా పదోన్నతులతోపాటు నంద్యాల జిల్లాలో పోస్టింగులు పొంది 2023 నుంచి జీతాలు రాకుండా వున్న ఉద్యోగులు.. ఎంపీహెచ్ఎస్‌లు కె.పద్మావతి (పీహెచ్‌సీ మాయలూరు), ఎన్.ధనమ్మ (పెద్దఎమ్మిగనూరు) భాగ్యమ్మ (డబ్ల్యు కొత్తపల్లె), ఎ.శిరీష (నొస్సం), వి.వరలక్ష్మి (అహోబిలం), మరో వి.వరలక్ష్మి (కోడుమూరు), డి.మధుకుమార్ (పాములపాడు), ఎస్.వన్నూరు బాషా (తలముడిపి), స్టాఫ్ నర్సు ఎం.అరుణకుమారి (దీబగుంట్ల పీహెచ్‌సీ).

అక్రమ గ్యాస్‌సిలిండర్లు పట్టివేత



సీజ్ చేసిన సిలిండర్లు

కడప క్రైం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : కడప నగరంలోని చిలకలబావి వద్ద ఓ వ్యక్తి అక్రమంగా సిలిండర్లు నిల్వ ఉంచి.. విక్రయిస్తుండగా పట్టుకుని సీజ్ చేసినట్లు కడప రీజనల్ విజిలెన్స్ అధికారులు గీతావాణి, దక్షిణ రామమూర్తి, ఫుడ్ఇన్స్‌పెక్టర్, కడప మున్సిపల్ కార్పొరేషన్ మనోజ్‌లు తెలిపారు. కడప రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంటు ఆఫీసరు జి.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు సోమవారం నగరంలోని చిలకలబావి జీఎం ఫంక్షన్‌హాలు వద్ద మిట్ట సుబ్బనరసయ్య అనే వ్యక్తి గృహఅవసరాల నిమిత్తం వాడుకునే గ్యాస్‌సిలిండర్లను అక్రమంగా విక్రయిస్తుండగా తనిఖీ చేశామన్నారు. తనిఖీల్లో మోసం బయటపడడంతో అక్కడ ఉండే 21 గ్యాస్‌సిలిండర్లను సీజ్ చేసినట్లు తెలిపారు. నిందితునిపై 6(ఎ) కేసు నమోదు చేశామన్నారు.

అగ్నికి ఆహుతైన మామిడి చెట్లు



శ్రీనివాసపురంలో కాలిపోయిన మామిడి చెట్లను చూపిస్తున్న బాధితుడు శ్రీనివాసులు

గాలివీడు, మార్చి3 (ఆంధ్రజ్యోతి): ఆకతాయిలు పెట్టిన అగ్నికి మామిడి చెట్లు ఆహుతి అయ్యాయి. బాధితుని కథనం మేరకు వివరాల్లోకి వెళితే... నూలివీడు పంచాయతీ శ్రీనివాసపురానికి చెందిన పోలా శ్రీనివాసులు గ్రామానికి సమీపంలో మామిడి తోట ఉంది. సోమవారం మధ్యాహ్నం ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు సమీపంలోని గుట్టకు నిప్పు పెట్టడంతో అక్కడి నుంచి వ్యాపించి మామిడి తోటకు అంటుకొని దాదాపుగా 40 వరకు చెట్లు కాలిపోయాయి. చెట్లకు 10 సంవత్సరాలకు పైబడి వయస్సు ఉందని.. మామిడి చెట్లను బతికించుకోవడానికి రూ.వేలు ఖర్చు పెట్టి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేశానని తెలిపారు. పూతకు వచ్చిన దశలో నిప్పు పెట్టడంతో మొత్తం చెట్లు అన్ని కాలిపోయాయని వాపోయారు. అధికారులు స్పందించి ప్రభుత్వం నుంచి సహాయం అందజేయాలని ఆయన కోరారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

వాల్మీకిపురం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విఠలం గ్రామం వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమా దంలో కురబలకోట మండలం అడవి పల్లెకు చెందిన శారద మృతి చెందిన విషయం విదితమే. అదే ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆమె భర్త మాధవరెడ్డి బెంగళూరులో చికిత్స పొందు తూ సోమవారం ఉదయం మృతి చెందాడు. వాల్మీకిపురం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



పీలేరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముడుపులవేముల పంచాయతీ రెడ్డివారిపల్లె వద్దనున్న బస్టాప్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు అర్బన్ సీఐ యుగంధర్ తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతూ గత రెండు రోజులుగా అదే బస్టాపులో ఉన్న అతను సోమవారం ఉదయం మృతి చెందినట్లు గ్రామస్తులు సమాచారం అందించడంతో అతని మృతదేహాన్ని పీలేరు ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీకి తరలించామని తెలిపారు. అతని గురించి తెలిసిన వారు తమకు 9440796744, 9440796745 నెంబర్లకు సమాచారం అందిం చాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ప్రేమ పెళ్లి పేరుతో మోసం... యువకుడి అరెస్టు

కడప క్రైం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : కడప నగరం వన్‌టౌన్ పరిధికి చెందిన ఓ యువతిని ప్రేమ పెళ్లి పేరుతో మోసం చేసిన యువకున్ని అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. వారి వివరాల మేరకు.. నంద్యాల జిల్లా దొర్లపాడు గ్రామానికి చెందిన గణేశ్ కడపలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో పనిచేస్తుండేవాడు. అక్కడే పనిచేస్తున్న ఓ యువతిని ప్రేమ పెళ్లి పేరుతో శారీరకంగా వాడుకుని మోసం చేశాడు. ఈ మేరకు యువతి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి.. గణేశ్‌ను అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు తెలిపారు.

అదృశ్యమయ్యాడు.. ఆపై శవమై తేలాడు

కడప క్రైం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : కడప నగరం రిమ్స్‌లో చికిత్స కోసం వచ్చి అక్కడ నుంచి అదృశ్యమై చివరికి శవమై తేలాడు. రిమ్స్ పోలీసుల వివరాల మేరకు.. ఆర్‌టీపీపీలో బాలాంజనేయులు (54) అనే వ్యక్తి ఉద్యోగిగా పనిచేసున్నాడు. ఈయన గత కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతుండేవాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం జనవరి 6న కడప రిమ్స్‌లో చేర్పించారు. మరుసటిరోజు 6వ తేదీ రాత్రి ఆసుపత్రి నుంచి బయటికి వెళ్లి అదృశ్యమయ్యాడు. జ్యోతి కెమికల్ సమీపంలోని పాడుబడ్డ లెట్రిన్ గుంత నుంచి దుర్వాసన రావటంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో అక్కడికి వెళ్లి పోలీసులు మృతదేహాన్ని గుర్తించారు. మృతదేహానికి ఉన్న దుస్తుల ఆధారంగా బాలాంజనేయులు కుటుంబ సభ్యులను పిలిపించి వారు బాలాంజనేయులుగా గుర్తించారు. మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. అయితే 6వ తేదీ మిస్సింగ్ అయిన బాలాంజనేయులు ఎక్కడెక్కడ తిరిగాడో, ఏమి అనేది పూర్తి వివరాలు తెలియడం లేదు. కుటుంబ సభ్యులు కూడా ఫిబ్రవరి 19న ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి విచారించారు. సోమవారం ఆయన మృతదేహాన్ని గుర్తించారు. మృతికి గల కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

విషద్రావణం తాగి వివాహిత ఆత్మహత్య

కడప క్రైం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): కడప నగరం ఐటీఐ సర్కిల్ సమీపంలో ఉన్న ఓ వివాహిత తలకు పూసుకునే రంగు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. తాలుకా సీఐ వెంకటేశ్వర్లు వివరాల మేరకు.. ఐటీఐ సర్కిల్‌కు చెందిన సుభాన్‌బీ (22)కి నాలుగేళ్ల క్రితం చెన్నూరు మండలం ఓబులవారిపల్లెకు చెందిన వ్యక్తితో వివాహం జరిగింది. భార్యభర్తల మధ్య మనస్పర్థల కారణంగా కడప ఐటీఐ సమీపంలో తల్లిదండ్రుల వద్ద ఉంటోంది. ఈ నేపథ్యంలో మనస్థాపం చెందిన ఆమె ఆదివారం రాత్రి తలకు పూసుకునే రంగు తాగడంతో కుటుంబ సభ్యులు గుర్తించి చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు సీఐ తెలిపారు.

యువకుడు ఆత్మహత్య

కడప క్రైం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) :కడప నగరం ఎస్టీ కాలనీలో నివాసం ఉంటున్న చెండ్రాయుడు (27) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చిన్నచౌకు పోలీసుల వివరాల మేరకు.. కడప ఎస్టీ కాలనీలో నివాసం ఉంటున్న చెండ్రాయుడు చిన్నచిన్న పనులు చేసుకుంటూ తల్లి వద్దనే ఉంటున్నాడు. ఆర్థిక సమస్యల కారణంగా ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహ త్యకు పాల్పడ్డాడు. బంధువుల వివరాల మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి



పెండ్లిమర్రి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గంగనపల్లె గ్రామ దళితవాడలో మేరి (52) అనే మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. మృతురాలి కూతురు నాగమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు తెలిపారు. సంఘటనా స్థలాన్ని సీఐ చల్లని దొర, ఎస్సైలు సిబ్బందితో కలసి పరిశీలంచారు.

కందులను దించుకోని వేర్‌హౌస్ అధికారులు

● నాలుగురోజులుగా ఇబ్బందులు పడుతున్నడ్రైవర్లు
● సరుకు సరిగా లేకపోవడంతో దించుకోలేదంటున్న అధికారులు



అనంతపురం జిల్లా నుంచి లారీల్లో తెచ్చిన విత్తన కందులను అన్‌లోడుచేయక నిలబడిన లారీలు

ప్రొద్దుటూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణంలోని వైఎంఆర్ కాలనీలో గల వేర్‌హౌస్‌గోడౌన్‌కు అనంతపురం జిల్లా రొద్దం నుంచి లారీల్లో వచ్చిన కందులను అధికారులు నాలుగు రోజులుగా దించుకోలేదని డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం గోడౌన్ అధికారులతో లారీ డ్రైవర్లు వాగ్వాదానికి దిగారు. గత నాలుగు రోజులుగా లారీలు నిలబడి తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునే వారే లేరన్నారు. దీనిపై వేర్ హౌస్ టెక్నికల్ సిబ్బంది 25 లారీల్లో కందుల విత్తనాలు వచ్చాయని.. 16 లారీల్లోని కందులు దించామన్నారు. తక్కిన లారీల్లో కందులు నాసిరకంగా ఉండటంతో అన్‌లోడ్ చేయలేమని తెలిపామన్నారు. రైతులకు అందజేయాల్సిన విత్తనాలు నాసిరకంగా ఉండటంతో దాదాపు 10 లారీల్లోని కందులను తిరిగి వెనక్కి పంపామని తెలిపారు.

రూ.10 లక్షలు చోరీ

సుండుపల్లె, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భాగఒపల్లి గ్రామ పంచాయతీ కుంటలముందర సమీపంలోని గురప్పచెరువు వద్ద ఓ వ్యక్తి వద్ద గుర్తు తెలియని వ్యక్తులు రూ.10 లక్షలు చోరీ చేశారు. పోలీసుల వివరాల మేరకు... సోమవారం రాత్రి భూమి కొనుగోలుకు నగదును బ్యాగులో తీసుకుపోతుండగా ముగ్గురు వ్యక్తులు అడ్డుకొని అపహరించినట్లు బాధితుడు వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు సంఘటనా స్థలానికి చేరుకొని ఎస్ఐ శ్రీనివాసులు విచారణ చేస్తున్నట్లు రాయచోటి రూరల్ సీఐ వరప్రసాద్ తెలిపారు. ఇంకా కేసు నమోదు చేయలేదు. పూర్తి వివరాలు తెలియాల్సి వుంది.

ఉద్యోగాల పేరుతో మోసం

● ఏజెంట్‌పై చర్యలు తీసుకోవాలి ● ప్రజావాణిలో జేసీకి బాధితుల ఫిర్యాదు



జాయింట్ కలెక్టర్ అదితిసింగ్‌కు వినతి పత్రం అందజేసిన బాధితులు

జమ్మలమడుగు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగాల పేరుతో మోసం చేసిన ఏజెంట్‌పై చర్యలు తీసుకుని.. తమకు న్యాయం చేయాలని జమ్మలమడుగు ప్రాంతానికి చెందిన బాధితులు జాయింట్ కలెక్టర్ అదితి సింగ్‌కు సోమవారం ప్రజావాణిలో వినతి పత్రం అందజేశారు. కడపకు చెందిన ఆది రవి కుమార్ అనే వ్యక్తి కేంద్ర ప్రభుత్వ సంస్థ పేరుతో ఉద్యోగాలు ఇప్పిస్తానని ఒక్కొక్కరి వద్ద రూ.4 లక్షల నుంచి రూ.6 లక్షల వరకు సుమారు కోటి రూపాయలు వసూలు చేశారన్నారు. ఫేక్‌మెయిల్‌తో అపాయింట్‌మెంట్ లెటర్లు పంపి అధికారులను సైతం మోసం చేశారన్నారు. దీనిపై జమ్మలమడుగు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన తర్వాత తమను బెదిరిస్తున్నారని వాపోయారు. విచారణ చేసి తమకు న్యాయం చేయాలని జేసీకి విన్నవించారు. డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్, కమిటీ నాయకుల పాల్గొన్నారు.

ప్రైవేటు ఆసుపత్రిలో పసికందు మృతి

● వైద్యుని నిర్లక్ష్యం కారణమంటూ కుటుంబసభ్యుల ఆందోళన
● ఇన్‌ఫెక్షన్ల వల్ల మరణించాడని డాక్టర్ వివరణ



ఆసుపత్రి వద్ద ఆందోళన చేస్తున్న పసికందు తల్లి బంధువులు

ప్రొద్దుటూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణంలోని గాంధీరోడ్డు పోసినా కాంపౌండులో వున్న ఓ ప్రైవేటు ఆసుపత్రిలో పది రోజుల పసికందు చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీంతో బాలుడి తల్లిదండ్రులు సరైన వైద్యం అందించక పోవడంతో మృతి చెందాడని బంధువులతో కలిసి ఆసుపత్రి ఎదుట ఆందోళన చేశారు. వివరాల్లోకి వెళితే...

జమ్మలమడుగు నియోజకవర్గం గండికోటకు చెందిన నాగేశ్వరి అనే మహిళ ఫిబ్రవరి 20న జమ్మలమడుగులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో మగబిడ్డను ప్రసవించింది. ఆబిడ్డ ఏడుపు లేకుండా పుట్టడంతో పిల్లల వైద్య నిపు ణులకు చూపించమని అక్కడి వైద్యులు చెప్పడంతో ఫిబ్రవరి 21 న రాత్రి ప్రొద్దుటూరు గాంధీ రోడ్డులో గల చిన్న పిల్లల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో చేర్పించారు. పిల్లల వైద్య నిపుణుడు మొదట రూ.25 వేల ప్యాకేజీ అడ్వాన్స్ కట్టించుకుని చికిత్స ప్రారం భించినట్టు తల్లిదండ్రులు తెలిపారు. 11 రోజుల పాటు బాలుడికి చికిత్స చేసి రూ.4లక్షలు వసూళ్లు చేసి ఆఖరికి బాలుడి మృతదే హాన్ని అప్పగించారని ఆవేదన వ్యక్తం చేశారు. మధ్యలో వేరే చోటి కి వెళతామన్నా డాక్టర్ ఒప్పుకోలేదని తీరా విషమించాక కర్నూ లుకు తీసుకెళ్లమని చెప్పాడని బాలుడి తండ్రి గురుమోహన్ తెలి పారు. ఈ ఆందోళనక్రమంలో అదే ఆసుపత్రిలో తమ పిల్లలకు సరైన వైద్యం అందించకుండా లక్షలు వసూలు చేసి అనారోగ్యం బాగుచేయడం లేదన్నారు. దీంతో మా పిల్లలప్రాణాలు కాపాడు కోవడానికి వేరే ఆసుపత్రికి వెళ్ళి రక్షించుకున్నామని తెలిపారు. ఈ పసికందు మరణంపై డాక్టర్ లోకేశ్వర్‌ను వివరణ కోరగా 21 న రాత్రి బాలుడుని ఆసుపత్రికి తెచ్చారని.. పసికందుకు 10 రోజులు ఆసుపత్రిలో సక్రమంగా చికిత్స అందించామన్నారు. అయితే ఇన్‌ఫెక్షన్ వల్ల బీపీ పెరిగి గుండె వేగంగా కొట్టుకోవడం వలన ప్రాణాలు కాపాడలేకపోయామన్నారు.

కడప నగరం 5వ డివిజనులోని ప్రధాన రహదారిపై బస్సు షెల్టరు వద్ద చెత్త కుప్పను సోమవారం కార్పొరేషన్ అధికారులు తొలగించారు. బస్ షెల్టరు కూడా పరిశుభ్రం చేశారు. కాగా బస్సుషెల్టర్ వద్ద ఉన్న చెత్త కుప్ప వల్ల వచ్చే వాసనతో ప్రయాణికుల ఇబ్బందులను ఆంధ్రజ్యోతి సోమవారం 'చిత్రం చెప్పిన సమస్య'లో వివరించింది. అందుకు కార్పొరేషన్ అధికారులు స్పందించి ఆ ప్రాంతాన్ని శుభ్రం చేశారు. అధికారులు వెంటనే స్పందించడం పట్ల ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కడప క్రైం, ఆంధ్రజ్యోతి



'కూటమి'ని చాలా రోజులు కొనసాగించలేరు'

కమలాపురం రూరల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వాన్ని చాలా రోజులు కొనసాగించలేరని కమలాపురం వైసీపీ ఇన్‌చార్జి నరేన్ రామాంజులరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక వైసీపీ కార్యాలయంలో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన తొలి బడ్జెట్ నిరాశపరిచిందని ఈ ప్రభుత్వంచాలా రోజులు కొనసాగలేదని ఆయన తెలిపారు. కూటమి ప్రభుత్వం చెప్పిన గ్యారంటీలు కాస్త బురడీలుగా మారాయన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటిలో కోతలు విధించారన్నారు.కార్యక్రమంలో ఉత్తమారెడ్డి, ప్రసాద్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, మస్తానయ్య,చెన్నకేశవరెడ్డి, ఇస్మాయిల్, మోహన్ రెడ్డి, మహ్మద్, సాధిక్, జగన్‌మోహన్‌రెడ్డి, గంగాధర్‌రెడ్డి, కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పవన్‌కళ్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు

పోలీసులకు ఫిర్యాదు

వేంపల్లె, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీసీఎం పవన్‌కళ్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన చక్రాయపేట మండలం అద్దాలమర్రికి చెందిన బి.మల్లికార్జునరెడ్డిపై వేంపల్లె పోలీస్‌స్టేషన్‌లో జనసేన నాయకులు ఫిర్యాదు చేశారు. ఆ పార్టీ పులివెందుల సమన్వయకర్త హరీష్ సోమవారం సీఐని కలిసి ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో పోతిరెడ్డి జయచంద్ర, మనోజ్, శ్యామ్, దేవ, మల్లి, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఖిల్లా మసీదులో అక్రమ నిర్మాణాలు ఆపాలంటూ నోటీసు



ఖిల్లామసీదులోని నిర్మాణ గోడకు నోటీసును అతికిస్తున్న పంచాయతీ సిబ్బంది


చెన్నూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : మేజరు పంచాయతీ చెన్నూరులోని ఖిల్లా మసీదులో పంచాయతీ అనుమతి లేకుండా కడుతున్న నిర్మాణాలు ఆపాలని గ్రామ పంచాయతీ కార్యదర్శి శివకుమార్ స్థానిక ఖిల్లా మసీదుకు నోటీసు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ 1994 పంచాయతీరాజ్ చట్టం అనుసరించి సెక్షన్ 121 ప్రకారం పంచాయతీలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టాలన్నా అనుమతి తప్పనిసరి అన్నారు. కాగా ఖిల్లా మసీదు ముందస్తు అనుమతి పొందకుండా భవన నిర్మాణాలు చేపట్టడం చట్ట విరుద్ధమని అన్నారు. ఈ నిర్మాణాన్ని నిలుపుదల చేయడమో, జరుగుతున్న కట్టడాలను తొలగించడమో చేయాలన్నారు. నోటీసు అందించిన ఏడురోజుల్లోపు అనుమతి లేని కట్టడాల నిర్మాణం ఆపడమో, లేక తొలగించడమో చేయాలన్నారు. అలా చేయకపోతే 1994 పంచాయతీరాజ్ చట్టం నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని నోటీసులో తెలియజేసిట్లు ఆయన తెలిపారు. పైగా నోటీసులు ఖిల్లా మసీదు కమిటీ తీసుకోకపోవడంతో దాన్ని నిర్మాణాలు జరిగే మసీదు ప్రాంత గోడకు అతికించినట్లు తెలిపారు. అలాగే మసీదు ఎదురుగా ఉన్న నాగేశ్వరస్వామి ఆలయం ముందున్న మురుగు కాలువపై ఉన్న నిర్మాణాలు, అలాగే ఆలయం ఎదురుగా మురుగుకాలువపై ఉన్న నిర్మాణాలతో పాటు మరో ఎనిమిది మంది కుటుంబ యజమానులకు నోటీసులు జారీ చేసినట్లు పంచాయతీ కార్యదర్శి శివకుమార్ తెలిపారు.

వైవీయూలో ఉత్సాహంగా క్రీడాపోటీలు

కడప ఎడ్యుకేషన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయ కాలేజ్ డే, ఫౌండేషన్ డే సందర్భంగా కళాశాల అంతర్‌విభాగ క్రీడా పోటీలలో భాగంగా సోమవారం జరిగిన క్రికెట్ ఫైనల్ పోటీలను రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.పద్మ ప్రారంభించారు. ఈ పోటీలలో ఎర్త్‌సైన్స్, బయోటెక్నాలజీ అండ్ బయో ఇన్‌ఫర్మేటిక్ జట్టు విజయం సాధించి మొదటిస్థానంలో నిలిచింది, రెండోస్థానంలో మేనేజ్‌మెంట్ స్టడీస్ (ఎంబీఏ) జట్టు నిలిచింది. నాన్‌టీచింగ్ ఫైనల్ మ్యాచ్‌లో గ్రీన్ కింగ్స్ లెవెన్ జట్టు విజయం సాధించారు. వేమన వారియర్స్ రెండోస్థానంలో నిలిచారు. విజేతలకు రిజిస్ట్రార్ పద్మ, క్రీడాబోర్డు కార్యదర్శి, వ్యాయామ విద్యా క్రీడా శాస్త్రాల విభాగాధిపతి డాక్టర్ కె.రామసుబ్బారెడ్డి విజేతలను అభినందించారు.

సీమ ప్రాజెక్టులకు బడ్జెట్ నిధులపై ప్రతినిధులు స్పందించాలి

కడప సెవెన్ రోడ్స్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై జిల్లా పట్ల వివక్ష, కక్షసాధింపు ధోరణికి నిరసనగా సోమవారం అంబేడ్కర్ సర్కిల్‌లో ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ హాజరై మాట్లాడారు. రాయలసీమ సాగునీటి వనరుల అభివృద్ధికి రాష్ట్ర బడ్జెట్‌లో నిధులు కేటాయింపులు చేయకపోవడం చాలా అన్యాయమన్నారు. కార్మిక రైతు వ్యవసాయ కార్మిక సంఘాల జిల్లా కార్యదర్శులు మనోహర్, దస్తగిరిరెడ్డి, అన్వేష్,డీవైఎఫ్ఐ యువజన సంఘ జిల్లా కార్యదర్శి వివకుమార్, నగర కార్యదర్శి విజయ్, ఐఎన్ సుబ్బమ్మ, సీఐటీయునాయకులు రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కడప-రాయచోటి జాతీయ రహదారిలో మూలవంక వద్ద హైవేరోడ్డుపైన బటర్‌ఫ్లై లైట్లు వెలుగక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కార్పొరేషన్‌వారు పట్టించుకోకపోవడంతో నిత్యం ఇబ్బందులకు గురవుతున్నారు. సచివాలయానికి కూతవేటు దూరంలో ఉన్నప్పటికీ స్పందించకపోవడం విచారకరమని స్థానికులు, వాహనదారులు ఆరోపిస్తున్నారు. మూలవంక నుంచి ఊటుకూరు ఫ్లైఓవర్ వరకు అనేకచోట్ల లైట్లు వెలుగడంలేదని ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకుని లైట్లు వెలిగేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

సీకేదిన్నె, ఆంధ్రజ్యోతి

బాల్యవివాహాలు చట్ట విరుద్ధం

కడప కల్చరల్, మార్చి 3, (ఆంధ్రజ్యోతి): బాల్య దశలోనే ఆడపిల్లలకు వివాహాలు చేయడం చట్ట విరుద్ధమని దేవదాయ, ధర్మాదాయశాఖ కడప అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జున ప్రసాద్ ప్రజలకు సూచించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల (ఈనెల 1నుండి 8వరకు)ను పురస్కరించుకుని సోమవారం నగరంలో మత పెద్దలచే కొవ్వొత్తుల ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. ఈ ర్యాలీ కలెక్టరేట్ నుంచి నగర కోటిరెడ్డి సర్కిల్ వరకు సాగింది. ఈ కార్యక్రమంలో జిల్లా అర్చక ఐక్య వేదిక అధ్యక్షుడు విజయ్‌బట్టర్, అర్చక పురోహిత బ్రాహ్మణ సమాఖ్య జిల్లా ప్రధానకార్యదర్శి శ్రీధర్‌శర్మ, గౌరవాధ్యక్షులు బి. చంద్రమౌళిశర్మ, పిడతల గోపాలకృష్ణశర్మ,మహిళలు పాల్గొన్నారు.



కడప నగరంలో కొవ్వొత్తుల ర్యాలీ దృశ్యం

పులివెందుల రూరల్..: బాల్య వివాహాల వలన మంచి భవిష్యత్తును ఎంతోమంది కోల్పోతున్నారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాబున్ని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమాల్లో భాగంగా సోమవారం నల్లపురెడ్డిపల్లెలో అవగాహన కార్యక్రమం, కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు,విద్యార్థులు పాల్గొన్నారు.

చెన్నూరు..: బాల్యవివాహాలకు వ్యతిరేకంగా తల్లి దండ్రులు సమాజం ముందుకు అడుగు వేయాలని తహసీల్దారు సరస్వతి అన్నారు. ఈ సందర్భంగా బాల్యవివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. ఎంపీడీవో కిరణ్‌మోహన్‌రావు,ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

వేంపల్లె..: బాల్య వివాహాలు చేస్తే చట్టపరంగా శిక్షార్హులవుతారని డీఆర్‌డీఏ ఏపీఎం నీలకంఠారెడ్డి, వెంకటేశ్వర్లు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు స్వర్ణలత, నాగరత్న పేర్కొన్నారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం ముందు మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు, ఆయాలు డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

వేముల..: ఆడపిల్లలే దేశానికి గర్వకారణం అని ఎంపీడీఓ మల్లికార్జునరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభాభవనంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆధ్వర్యంలో బాల్య వివాహాల గురించి సమావేశం నిర్వహించారు. అనంతరం ర్యాలీ, ప్రతిజ్ఞ చేశారు.

సికెదిన్నె..: బాల్య వివాహాలను నిర్మూలించాలని ఎంపీడీవో కుళాయిబాబు, తహసీల్దారు నాగేశ్వరరావులు తెలిపారు. చింతకొమ్మదిన్నెలో సోమవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

సింహాద్రిపురం..: మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా సోమవారం సింహాద్రిపురంలో బాల్య వివాహాల నిర్మూలనపై అంగన్‌వాడీ కార్యకర్తలు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వసంతకుమారి, కార్యకర్తలు,ఆయాలు పాల్గొన్నారు.

రేపు టెంకాయల వేలం పాట

సింహాద్రిపురం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంకాళమ్మగూడూరు గ్రామంలో వెలసిన అంకాళమ్మ దేవత దేవస్థానంలో 5వ తేదీ బుధవారం టెంకాయల వేలం పాట నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ఛైర్మన్ అశోక్‌రెడ్డి, కమిటీ సభ్యులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ వేలం పాటలో పాల్గొనే వారు రూ. 50వేలు ప్రవేశ రుసుము చెల్లించాల్సి వుంటుందని ఛైర్మన్ తెలిపారు. ఆలయ నియమ నిబంధనల మేరకు వేలం పాట నిర్వహిస్తామన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

కడప క్రైం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు వారోత్సవాల్లో భాగంగా స్కూల్స్, కాలేజీల్లో పోలీసు అధికారులు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోలీసు అధికారులు మహిళా చట్టాలు, పోక్సోయాక్ట్, ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, గుడ్‌టచ్ బ్యాడ్ టచ్‌లపై వివరించారు.

ఎస్సీ, ఎస్టీలకు సబ్సిడీ రుణాలు విడుదల చేయాలి

కడప(వినాయకనగర్), మార్చి3(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు సబ్సిడీ రుణాలు విడుదల చేయాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి కానగాల మునెయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం గ్రీవెన్ సెల్‌లో డీఆర్‌వోకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు మనోహర్‌బాబు, చంద్రగుప్త పాల్గొన్నారు.

వక్ఫ్ చట్ట సవరణ బిల్లును రద్దు చేయాలి

కడప సెవెన్ రోడ్స్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం చేసిన 2024 వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకుడు సయ్యద్ గౌస్‌పీర్ చేస్తున్న 36 గంటల దీక్షలకు ఆప్ కి ఆవాజ్ మద్దతు తెలిపింది. సోమవారం కడప పాత రిమ్స్ వద్ద ఉన్న ఇందిరాగాంధీ విగ్రహం వద్ద చేస్తున్న దీక్షల సందర్భంగా ఆప్ క ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి ఏక్ మక్బూల్ బాష మాట్లాడారు.

బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా బుర్రి రెడ్డయ్య

కడప మారుతీనగర్, మార్చి 3, (ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులుగా బుర్రి రెడ్డయ్య నియమితులయ్యారు. ఆ మేరకు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్యను హైదరాబాద్‌లోని బీసీ. సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యాల యంలో కలిసి నియామకపు ఉత్తర్వుల పత్రాలను రెడ్డయ్య అందుకున్నారు. కార్యక్రమంలో ఆ సంఘం రాయలసీమ జోన్ ఇన్‌చార్జ్ పట్టుపోగుల సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

పీజీ కామన్‌సెట్‌ను రద్దు చేయాలి

కడప ఎడ్యుకేషన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): పీజీ కామన్‌సెట్ విధానం, జీఓ77ను రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి బి.అరుణ్ డిమాండ్ చేశారు. సోమవారం కడప నగరం ఆర్ట్స్ కళాశాలలో నిరస కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు ఈశ్వర్‌రెడ్డి, నాగార్జున, గణేష్, ప్రశాంత్ పాల్గొన్నారు.

పీ4 సర్వే త్వరగా పూర్తి చేయండి

సింహాద్రిపురం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా నిర్వహిస్తున్న పీ4 సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ కృష్ణమూర్తి గ్రామ కార్యదర్శులకు సూచించారు. సోమవారం సింహాద్రిపురం ఎంపీడీఓ కార్యాలయ సభాభవనంలో ఎంపీడీఓ అధ్యక్షతన సర్వేలపై సమీక్ష సమావేశం జరిగింది. కార్యక్రమంలో ఎంపీడీఓ కార్యాలయ ఏఓ శ్రీనివాసరెడ్డి, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

లింగాల..: పీ4 సర్వే త్వరగా పూర్తిచేయాలని పులివెందుల డీఎల్‌డీఓ శ్రీనివాస్ అన్నారు. లింగాల ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం సర్వేపై సమీక్షించారు. సర్వే పూర్తిచేయడంలో లింగాల మండలం వెనుకబడి ఉందని, సిబ్బందితో సమన్వయం చేసుకొని త్వరగా పూర్తిచేయాలన్నారు. ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, ఏఓ లోకేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలి

కడప ఎర్రముక్కపల్లె, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల కార్యక్రమంలో ప్రజలు ఇచ్చే ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కారం చేయాలని కమిషనర్ మనోజ్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం కడప కార్పొరేషన్ వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలో 33 అర్జీలు రాగా ఆయా విభాగాల అధికారులకు పంపించామన్నారు. వాటిని క్షేత్రస్థాయిలో సత్వరం పరిష్కరించాలని సూచించారు.



అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ మనోజ్‌రెడ్డి

ప్రతి ఒక్కరూ ఆరోగ్య సూత్రాలు పాటించాలి

పులివెందుల రూరల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఆరోగ్య సూత్రాలు తప్పక పాటించాలని పులివెందులలోని ఆహార విజ్ఞాన శాస్త్ర , సాంకేతిక కళాశాల అధ్యాపకురాలు అరుణ పేర్కొన్నారు. సోమవారం కళాశాల దత్తత గ్రామమైన బ్రాహ్మణపల్లెలో కౌమారదశ బాలికలకు రక్తహీనత నివారణ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ సాయిశ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మారతమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓపెన్ పరీక్షల అక్రమాలపై విచారణ చేపట్టాలి

కడప ఎడ్యుకేషన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఓపెన్ స్కూల్ పరీక్షలపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న డిమాండ్ చేశారు. సోమవారం డీఈఓ కార్యాలయంలో డీఈఓ షంషుద్దీన్‌కు వినతిపత్రం సమర్పించారు. పీడీఎస్‌యూ జిల్లా నాయకులు బాలాజి, విష్ణు,ఆనంద్, నందు తదితరులు పాల్గొన్నారు.

పంటలకు మద్దతు ధర అమలు చేయాలి

పెండ్లిమర్రి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): పండించిన పంటలకు ప్రభుత్వం మద్దతు ధరలు అమలు చేయాలని వ్యవసాయ కార్మికసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అన్వేష్ డిమాండ్ చేశారు.మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం డిప్యూటీ తహసీల్దార్ నరసింహులుకు వినతిపత్రం అందచేశారు. ఈకార్యక్రమంలో మండల నాయకులు చెన్నయ్య, ఐవారయ్య, మల్లేష్, గంగాధర్, ఉత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సమాచార వ్యవస్థ ఏర్పాటుచేసుకోవాలి

లింగాల, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఏ చిన్న సంఘటన జరిగిన వెంటనే సమాచారం అందేలా ఇన్‌ఫార్మర్ వ్యవస్థను బలోపేతం చేసుకోవాలని పులివెందుల రూరల్ సీఐ ఎన్వీ రమణ అన్నారు. లింగాల పోలీస్‌స్టేషన్‌లో సోమవారం సిబ్బందితో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వాహన తనిఖీలో పాల్గొని ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ఉపయోగించాలన్నారు. ఎస్ఐ మధుసూధన్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

హోంగార్డులను ఏపీకి బదిలీ చేయాలి

కడప సెవెన్‌రోడ్స్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఏపీకి చెందిన తెలంగాణలో పనిచేస్తున్న హోంగార్డులను ఆంధ్రప్రదేశ్‌కు బదిలీ చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి శరత్‌కుమార్, ఆర్గనైజింగ్ కార్యదర్శి సి.శివనాగేంద్ర డిమాండ్ చేశారు. సోమవారం కడప కలెక్టరేట్‌లోని స్పందనలో జేసీకి వినతిపత్రం సమర్పించారు. ఏఐవైఎఫ్ నగర నాయకులు సంజీవ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వమే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

ఏపీ రైతు సంఘం నాయకులు

కడప సెవెన్ రోడ్స్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వమే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఏపీ రైతు సంఘం నాయకులు పేర్కొన్నారు.సోమవారం నగరంలోని రైతు సంఘం జిల్లా కార్యాలయంలో వారు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పోతిరెడ్డి భాస్కర్ మాట్లాడుతూ ఎండుమిరప, పప్పు శనగ, కందులు పండించిన రైతులు కల్తీ,నకిలీ విత్తనాలు, చీడ పీడల వలన సరైన దిగుబడులు నష్టపోయే పరిస్థితి ఉందన్నారు. వెంటనే ప్రభుత్వం గిట్టుబాటు ధరలను ప్రకటించి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రామ్మోహన్‌రెడ్డి, పక్కీరప్ప పాల్గొన్నారు.

నేటి నుంచి మావూళ్లమ్మ నూతన ఆలయ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ

చక్రాయపేట, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిలేకాంపల్లె-నారపురెడ్డిగారిపల్లె సమీపాన వెలసిన మావూళ్లమ్మ ఆలయ ధ్వజస్తంభ, నూతన ఆలయ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. మూడు రోజులపాటు జరిగే ఈ మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. హరికథలు, చెక్కభజనలు, అన్నదానం చేపట్టనున్నట్లు తెలిపారు. అలాగే శివపార్వతుల కల్యాణోత్సవం కూడా నిర్వహించనున్నారు. 6వ తేదీ బండలాగుడు పోటీలు నిర్వహించనున్నారు. మొదటి నుంచి ఐదు బహుమతులు ఉంటాయని వరుసగా రూ.70వేలు, రూ.50వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేలు బహుమతులు ఉంటాయన్నారు.



మావూళ్లమ్మ తల్లి ఆలయం

విద్యార్థుల కంటి ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలి

కడప సెవెన్ రోడ్స్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల కంటి ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇచ్చేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తగు శ్రద్ధ తీసుకోవాలని ఎల్వీపీఈఐ వైద్యులు డాక్టర్ శశిబిందు తిప్పన్న సూచించారు. ఈ మేరకు విద్యార్థులు వారి కంటి ఆరోగ్యానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు అనే అంశంపై సోమవారం నగరంలోని ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ వైఎస్సార్ క్యాంపస్‌లో నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు.

క్షేత్ర సహాయకుడిగా సుధాకర్

సికెదిన్నె, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): చింతకొమ్మదిన్నె మండలం కొలుములపల్లె పంచాయతీ ఉపాధి హామీ క్షేత్ర సహాయకుడిగా కొమ్మద్ది సుధాకర్‌ను నియమించినట్లు ఎంపీడీవో కుళాయిబాబు తెలిపారు. ఉపాధి హామీ ప్రాజెక్టు డైరెక్టర్ ఉత్తర్వుల మేరకు సోమవారం ఏపీవో రామాంజనేయులరెడ్డితో కలిసి నియామక పత్రాన్ని అందుకోవడం జరిగిందన్నారు. కూలీలకు పని దినాలు కల్పించి సరైన కూలి పడేటట్లు చూడాలన్నారు.

ఆప్కాస్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కడప సెవెన్‌రోడ్స్ మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఆప్కాస్‌లోని మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ సోమవారం కడప కలెక్టరేట్ కార్యాలయం వద్ద నిరసన ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి, జిల్లా అధ్యక్షులు వేణుగోపాల్, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు కేసీ బాదుల్లా, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నగర అధ్యక్ష కార్యదర్శులు నరసింహులు, తారక రామారావు మాట్లాడారు. ఆప్కాస్ రద్దుని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు.



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న ఏఐటీయూసీ నాయకులు

ఏడేళ్లుగా ఏడిపిస్తున్న అధికారులు

● 22ఏ చట్టం చక్రంలో స్వప్న వీధి బాధితులు ● 45రోజుల్లో రెవెన్యూ సదస్సుల్లో పరిష్కారం ఎక్కడ? ● ఆగ్రహిస్తున్న స్థానికులు

ఎర్రగుంట్ల, మార్చి 3(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ అధికారులు ఒకటి కాదు.. రెండుకాదు..ఏకంగా ఏడళ్ల నుంచి సమస్యను పరిష్కరించకుండా కార్యాలయాలకు తిప్పుకుంటూ తమను ఏడిపిస్తున్నారని స్వప్న వీధివాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కోట్లువిలువచేసే సొంతవిలువైన ఆస్తులను సైతం ఉపయోగించుకోలేని దౌర్భాగ్యస్థితిలో ఉన్నామని బాదిత ప్రజలు వాపోతున్నారు. తాము చేసిన తప్పులను సరిదిద్దుకోకుండా మరొకశాఖపై నెట్టుతూ ప్రజలను తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారని ఎర్రగుంట్ల నగర పంచాయతీలోని స్వప్న వీధి వాసులు పేర్కొంటున్నారు. సుమారు 150 ఇళ్లవరకు నివాసం ఉంటున్న ఈ వీధిలో సర్వేనెంబరు 489లో 2.40 ఎకరాల భూమిలో పాత నగరపంచాయతి పరిపాలనా భవనానికి 30 సెంట్లు తేల్చి సబ్ డివిజన్ చేశారు. 489/2లో 2.10ఎకరాలు ఇళ్ల పట్టాలని, ప్రైవేటు వ్యక్తులకు సంబందించినదని సబ్‌డివిజన్‌చేశారు. 2018 వరకు అక్కడ రిజిస్ట్రేషన్ల లావాదేవీలు జరిగాయి. అయితే తర్వాత 22ఏ భూ నిషేధిత చట్టంలోకి ఈ సర్వేనెంబరును చేర్చారని ఇకపై రిజిస్ట్రేషన్లు జరగవని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులు తేల్చిచెప్పడంతో కాలనీవాసులు స్థానిక రెవెన్యూ అధికారులకు అనేక సార్లు ఫిర్యాదు చేశారు. అయినా స్పందించకపోవడంతో బాధితులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అయితే ఇప్పటి వరకు సమస్య పరిష్కారం కాలేదని వారంటున్నారు.



కమిషనర్‌కు వినతిపత్రాన్ని ఇస్తున్న స్వప్న వీధివాసులు

45రోజుల్లో పరిష్కారం ఏదీ...

రాష్ట్ర ప్రభుత్వం అట్టహాసంగా నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో ఇచ్చిన అర్జీలు 45రోజుల్లో కచ్చితంగా పరిష్కారం చూపాలన్న నిబంధన ఉంది. అయితే జనవరి 2వ తేదీన ఇచ్చిన అర్జీకి మార్చి 2వ తేదీ (60)రోజులైనా పరిష్కారం చూపడంలేదని బాధితులు పేర్కొంటున్నారు.

డివిజన్‌చేస్తున్నాం...

సర్వేనెంబరు 489లో నగరపంచాయతి స్థలం 30సెంట్లను డివిజన్ చేసి కమిషనర్ కు పంపుతున్నాం. వారు వాటిని అంగీకరించి, కౌన్సిల్ అనుమతి తీసుకుని ఇవ్వాలి. అనంతరం కలెక్టర్‌కు పంపుతాం. కలెక్టర్ సబ్ రిజిష్టార్‌కు నిషేధిత జాబితా నుంచి తొలగించమని ఆదేశాలిస్తారు. ఈమేరకు కలెక్టర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులున్నాయి.

-యామిని, డీటీ, ఎర్రగుంట్ల

పిల్లల చదువులు ఆగిపోతున్నాయి



నాకు వారసత్వంగా వచ్చిన 2.5సెంట్ల స్థలంలో నూతనంగా ఇల్లు కట్టుకున్నాం. పిల్లల చదువుకోసం లోన్‌తెచ్చుకునేందుకు బ్యాంకు వెళితే ఈసీ, ఇతర డాక్యుమెంట్లు తెమ్మన్నారు. రిజిస్ట్రేషన్ కార్యాలయంకు వెళితే 22/ఏ నిషేధిత జాబితాలో ఉందని లోన్ రాలేదు. పిల్లల చదువులు ఆగిపోతే ఎవరు బాధ్యత వహిస్తారు. అధికారులు నిషేధిత జాబితా నుంచి మా స్థలాలను తొలగించి న్యాయం చేయాలి.

-ఏ.లక్ష్మిదేవి, ఇంటినెంబరు 4/766, స్వప్నవీధి.ఎర్రగుంట్ల

ఇల్లుకొన్నాం...రిజిష్టర్ కావడంలేదు



ఏడేళ్లక్రితం కొన్నాను. లక్షల్లో అడ్వాన్స్ ఇచ్చాను. రిజిష్టర్ చేయించుకోవాలను కుంటే నిషేధిత జాబితాలో ఉందని రిజిష్టర్లు కావని సబ్‌రిజిస్ట్రా కార్యాలయ అధికారులు తేల్చారు. ఇల్లు అమ్మిన వారు బ్యాలెన్స్ ఇమ్మని ఒత్తిడి తెస్తున్నారు. ఇల్లు అమ్మిన యజ మాని, కొన్న నేను ఇద్దరం తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఉన్నతాధికారులు మా సమస్య పరిష్కంచాలని వేడు కుంటున్నాం.

-మారుతికుమార్. స్వప్న వీధి, ఎర్రగుంట్ల

ప్రశాంతంగా ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్ష

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ప్రొద్దుటూరు మండలంలో తొమ్మిది పరీక్షా కేంద్రాల్లో 1954 మంది విద్యార్థులను కేటాయించగా మొదటి రోజు 1879 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 75 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. తెలుగు, సంస్కృతం, ఉర్దూ భాషా పరీక్షలు నిర్వహించారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో గట్టి పోలీసు బందోబస్తు మధ్య పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి.

మైదుకూరు రూరల్‌లో : మైదుకూరులో ద్వితీయ ఇంటర్ పరీక్షలను అధికారులు ప్రశాంతగా నిర్వహించారు. మొదటి రోజు తెలుగు పరీక్షతో పరీక్షలు ప్రారంభమయ్యాయి. నాలుగు సెంటర్లలో పరీక్షలు జరుగగా మొత్తం 790 మంది విద్యార్థులకు గాను 109 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు జిల్లా ఇంటర్ పరీక్షల నిర్వహణ అధికారి వెంకటసుబ్బయ్య తెలిపారు.

ఎమ్మార్పీకే నాణ్యమైన ఎరువులు విక్రయించాలి



స్టాకు నిల్వలను తనిఖీ చేస్తున్న వ్యవసాయ అధికారులు

గోపవరం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : గోపవరం మండల పరిధిలోని ఎరువులు, పురుగు మందులు దుకాణాలలో ఎమ్మార్పీకే ఎరువులు, పురుగు మందులను విక్రయించాలని సోమవారం వ్యవసాయ అధికారి ఎం.నాగరాజ తెలిపారు. తమ సిబ్బందితో ఆయన ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం రికార్డులు పరిశీలించి స్టాకునిల్వ, ధరల పట్టిక, ఇన్వాయిస్, స్టాకు రిజిస్టరు, లైసెన్సు గడువు వంటి అంశాలను పరిశీలించారు. రసీదు తప్పనిసరిగా ఇవ్వాలని బయోమెట్రిక్ విధానం పాటించాలని తెలిపారు. గడువు ముగిసిన పురుగు మందులను, నిషేధంలో ఉన్న పెస్టిసైడ్స్ ఎట్టి పరిస్థితుల్లోనూ నిల్వ ఉంచి అమ్మరాదన్నారు. లేదంటే చట్టపరంగా చర్యలు తప్పవన్నారు.

ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి

పోరుమామిళ్ల, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ కొండారెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఈదుళ్లపల్లె సమీపంలో వాహనదారులకు సమావేశం నిర్వహించి వారికి హెల్మెట్‌పై, సీటుబెల్టులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు ఖచ్చితంగా హెల్మెట్ ధరించడంతోపాటు లైసెన్సు, ఆర్‌సీ ఇన్సూరెన్స్ కలిగి ఉండాలన్నారు. అలాగే సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అన్నారు.

సిమెంటు పరిశ్రమ కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలి

ఎర్రగుంట్ల, మార్చి 3(ఆంధ్రజ్యోతి): సిమెంటు పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు కనీస వేతనం రూ.1000ఇవ్వాలని ఆర్‌ఆర్‌ఎస్ అధ్యక్షుడు కుంచం వెంకటసుబ్బారెడ్డి యాజమాన్యాలను డిమాండ్ చేశారు. సోమవారం ఎర్రగుంట్ల తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని ఇచ్చారు. ప్రస్తుతం పరిశ్రమలో పనిచేసే కార్మికులకు కనీసం రూ.350కూడా ఇవ్వడంలేదని ఆయన విమర్శించారు. కార్మికులకు కనీస మౌలిక వసతులు కల్పించాలన్నారు. సిమెంటు పరిశ్రమల ద్వారా పన్నురూపంలో వచ్చే ఆధాయాన్ని స్థానిక గ్రామాల అభివృద్ధికే కేటాయించాలన్నారు.

డ్రగ్స్ వాడకం.. ప్రమాదకరం

ఎర్రగుంట్ల, మార్చి 3(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ వాడకం చాలా ప్రమాదకరమని విద్యార్థులు వాటికి దూరంగా ఉండాలని అర్బన్ హెల్త్ సెంటర్ డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఎర్రగుంట్లలోని ఐటీఐ విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల భవిష్యత్తు శూన్యంగా మారుతుందన్నారు. గుట్కా, సిగరెట్, డ్రగ్స్ వినియోగించడం వల్ల కలిగే బారీ నష్టాలన విద్యార్థులకు వివరించారు. చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ చదువుపై శ్రద్ధపెట్టి తద్వారా బంగారు భవిష్యత్తుకు బాటవేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆనంద్, సూపర్‌వైజర్ ఓబులేసు, తదితరులు పాల్గొన్నారు.

మైదుకూరులో అగ్నిప్రమాదం

మైదుకూరు రూరల్ మార్చి3(ఆంధ్రజ్యోతి) : స్థానిక బద్వేల్ రోడ్డు లోని మూడో వీధిలో గల ఓ ఇంటిలో సోమవారం అగ్ని ప్రమాదం చోటు చేసుకోంది. చికెన్ సెంటర్‌లో పని చేసుకొంటు జీవ నం సాగిస్తున్న షేక్ మహమ్మద్ ఆరీఫ్, అతని తల్లి బీబీ ఒక అద్దె ఇంట్లో ఉంటున్నారు. ఆరీఫ్ పనికి పోయినపుడు వృద్దురాలైన తల్లిని ఇంట్లోనే పెట్టి తాళం వేసుకొని వెళ్లేవాడు. సోమవారం కూడా ఆరీఫ్ పనికి వెళ్లినప్పుడు వంట చేసుకోవడానికి ఆ అతని తల్లి గ్యాస్‌పొయ్యి వెలిగించగా మంటలు చెలరేగాయి. వెంటనే స్పందించిన స్థానికులు ఇంటి తాళాలు, వాకిళ్లు పగులకొట్టి ఆమెను కాపాడారు. అనంతరం ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. సుమారు రెండు లక్షలు ఆస్తి నష్టంవాటిల్లినట్లు బాధితుడు ఆరీఫ్ తెలిపారు.

అదనపు కట్నం కోసం వేధించినందుకు కేసు నమోదు

పోరుమామిళ్ల, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : వివాహం జరిగి ఆరు నెలలు కావస్తున్నా అదనపు కట్నం కోసం వేధించడంతో మహిళ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు. మండలంలోని చెన్నారెడ్డిపేటకు చెందిన వెంకట చైతన్యరెడ్డితో రంగసముద్రంకు చెందిన శివ నాగేంద్రరెడ్డికి ఆరు నెలల క్రితం వివాహం జరిగిందని అయితే అప్పటి నుంచి అతని కుటుంబ సభ్యులు అదనపు కట్నం తీసుకురాలేదని ఆమెను మానసికంగా శారీకంగా వేధించడంతో విషయాన్ని ఆ మహిళ తన పుట్టింటి వారికి తెలిపారన్నారు. బాధితురాలి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శివ నాగేంద్రరెడ్డి అతని కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అసంపూర్తి భవనాన్ని పూర్తి చేయండి



అసంపూర్తిగా ఉన్న భవనం

బి.కోడూరు మార్చి 3, (ఆంధ్రజ్యోతి):బి. కోడూరు మండలంలో అసంపూర్తిగా నిలిచిన విద్యాశాఖ భవనాన్ని వెంటనే పూర్తి చేయాలని ప్రజలు కోరతున్నారు. గత ప్రభుత్వంలో విద్యాశాఖ భవనానికి 55 లక్షలు సర్వశిక్ష అభియాన్ కింద మంజూరయ్యాయి. ఆ పనిని దక్కిం చుకున్న గుత్తేదారు దాదాపుగా 25లక్షలు ఖర్చుపెట్టి బిల్డింగ్ పనులు ప్రారంభించారు. కాగా ఆ భవనం ఇంకా పూర్తికాక అసంపూర్తిగా ఆగిపోయింది. ఈ విషయమై ఎంఈవో సునీల్‌కుమార్ మాట్లాడు తూ విద్యాశాఖ భవనం మంజూరై చాలా రోజులవుతున్నా పూర్తి కాలేదనిన్నారు. ఈ విషయంగా సర్వశిక్షా అభియాన్ ఏఈ చంద్రశేఖర్‌ను వివరణ కోరగా గత ప్రభుత్వంలో బిల్లులు రాక పూర్తిచేయలేదన్నారు. ఈ సంవత్సరం నిధులు వస్తున్నాయని విద్యాశాఖ భనవాన్ని పూర్తిచేసి వారికి అప్పచెబుతామని పేర్కొన్నారు.

కిడ్నీ బాధితుడికి పింఛన్ అందజేత

కలసపాడు మార్చి3(ఆంధ్రజ్యోతి):కలసపాడుకు చెందిన కిడ్నీ బాధితుడు నరేంద్రకు పించన్ మంజూరు చేయించినట్లు జిల్లా తెలుగు రైతుసంఘం ఉపాధ్యక్షుడు పి.బాలిరెడి, స్థానిక సర్పంచ్ రాంబాబు తెలిపారు. ఆమేరకు బాధితుడికి ఇరువురు కలిసి పించన్ సొమ్మును అందచేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వృద్దులతోపాటు వివిధ రకాల రోగులకు పించన్‌లు అందిస్తూ అండగాఉంటోందన్నారు.

మహిళా సాధికారత కోసమే టైలరింగ్ శిక్షణ



ఉచిత టైలరింగ్ సెంటరు ప్రారంభించిన ఫుడ్‌కమిషన్ ఛైర్మన్

పోరుమామిళ్ల, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారత కోసమే మదర్‌థెరిసా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత టైలరింగ్ సెంటరు ఏర్పాటు చేస్తున్నారని ఏపీ ఆహార భద్రత ఛైర్మన్ చిత్త విజయప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు ఆరు నెలల పాటు ఉచితంగా టైలరింగ్ కోసం శిక్షణకు శ్రీకారం చుట్టామన్నారు. శిక్షణ పొందిన ఆరునెలల తరువాత ఫౌండేన్ వారి నుంచి కుట్టుమిషను అందుకోవాలన్నారు. కార్యక్ర మంలో జడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, ఫౌండేషన్ వ్యవస్థాపకులు చిత్తరవిప్రకాశ్‌రెడ్డి, ఆరోగ్యరాణి, గిరి ప్రణీత్‌రెడ్డి, డాక్టర్ అమితారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు సమాన హక్కులు కల్పించాలి

ముద్దనూరు మార్చి3(ఆంధ్రజ్యోతి):స్త్రీలకు పురుషులతో పాటు సమాన హక్కులు ఉన్నాయని ఎస్ఐ మైనుద్దీన్ పేర్కొన్నారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం అంతర్జాతీయ మహిళాదినోత్సవం పురస్కరించుకొని, వారోత్సవాల్లో భాగంగా విద్యార్థునులకు లింగ సమానత్వం లనే అంశం పై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మాబు, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాలికా విద్యపై చైతన్యం అవసరం

కొండాపురం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : బాలికా విద్యపై సమాజంలో చైతన్యం తీసుకురావాలని ఐసీడీఎస్ అధికారులు పిలుపునిచ్చారు. బేటీ బచావో-బేటీ పడావో కార్యక్రమంపై ర్యాలీ సోమవారం కొం డాపురంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహిం చారు. ఆడపిల్లలను బతకనిద్దాం, ఎదగ నిద్దాం అంటూ విద్యార్థులు ఫ్లకార్డులతో ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. అదేవి ధంగా బాల్యవివాహాల నిర్మూలనపై ఐసీడీఎస్, ఆసుపత్రి సిబ్బంది ఆధ్వర్యంలో సమా వేశం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భారతి, ప్రభుత్వా సుపత్రి సిబ్బంది, అంగనవాడీలు పాల్గొన్నారు.

శనగకు మద్దతు ధర ప్రకటించాలి

ఎర్రగుంట్ల, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): పప్పుశనగకు మద్దతు ధర ప్రకటించాలని కాంగ్రెస్, వైసీపీ, సీపీఐ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు సోమవారం వినతిపత్రాన్ని ఇచ్చారు. అధిక పెట్టుబడులు పెట్టి పండించిన పంటలకు దళారులు కేవలం రూ.5500లకే కొనడం వల్ల రైతులు బారీగా నష్టపోతున్నారని తెలిపారు. మార్క్‌ఫెడ్ ద్వారా వెంటనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. ఈకార్యక్రమంలో క్రిష్టారెడ్డి, ఎండీ సుబ్బారెడ్డి, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో కడప ఉక్కు ఫ్యాక్టరీ ప్రస్తావనే లేదు

బ్రహ్మంగారిమఠం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర అసెంబ్లీలో కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ 2025-26 కేటాయింపుల్లో కడప ఉక్కుఫ్యాక్టరీ నిర్మాణానికి నిధులు కేటాయించక పోవడం దారుణమని అఖిల భారత యువజన సమాఖ్య జిల్లా అధ్యక్షుడు పెద్దుళ్లపల్లె ప్రభాకర్ హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన సోమవారం విలేకర్లతో మాట్లాడుతూ ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయడం వల్ల ప్రత్యక్షంగా 25వేల మందికి పరోక్షంగా లక్ష మంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని అయితే బడ్జెట్‌లో కడప ఉక్కు ఫ్యాక్టరీ ఊసెత్తకపోవడం విచారకరమన్నారు. ఉక్కు పరిశ్రమ ఏర్పాటు కోసం ఏఐవైఎఫ్ దశల వారీ పోరాటాలు చేస్తుందని తెలిపారు.

రాష్ట్ర బడ్జెట్ ఆశాజనకంగా లేదంటూ ధర్నా

పోరుమామిళ్ల, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రబడ్జెట్‌లో ప్రజలకు న్యాయం జరగలేదని సీఐటీయూ ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో తహసీల్దారు కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా చేశా రు. ఈసందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు భైరవ ప్రసాద్, ఐద్వా సంఘం జిల్లా కార్యదర్శి గౌసియాబేగం మాట్లాడుతూ 2025-26 బడ్జెట్ అంకెల గారడి అన్నారు. లోబడ్జెట్, క్యాపిటల్ బడ్జెట్‌కు ఆదాయ వనరులు ఎక్కడ నుంచి వస్తాయో స్పష్టంగా ప్రజలకు వివరించలేదన్నారు. 3,22,359 కోట్లతో రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టారని అన్నారు. అందులో లోటుబడ్జెట్ 79926 కోట్లుగా ఉందని అన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ, ప్రజాసంఘాలు, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌లో కేసుల సత్వర పరిష్కారం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అదనపు జడ్జి సత్యకుమారి

ప్రొద్దుటూరు , మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : జాతీయ లోక్‌అదాలత్‌లో కేసులు సత్వర పరిష్కారం చేయడానికి కక్షిదారులతో మాట్లాడి కేసులు రాజీ చేయించాలని జిల్లా అదనపు జడ్జి కె సత్యకుమారి పోలీసు అధికారులకు సూచించారు. సోమవారం స్థానిక ప్రొద్దుటూరు కోర్టులో జాతీయ లోక్ అదాలత్ పై పోలీసు అధికారులతో జిల్లా జడ్జి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జడ్జి సత్యకుమారి మాట్లాడుతూ కోర్టులలో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సివిల్ క్రిమినల్ కేసులు రాజీ మార్గం ద్వారా లోక్ అదాలత్‌లలో పరిష్కరించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి ఫైజునిస్సా, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి హారిక, డీఎస్పీ భావన, సీఐలు యుగంధర్ రామకృష్ణారెడ్డి, గోవిందరెడ్డి, బాలమద్దిలేటి ఎస్ఐలు పాల్గొన్నారు.

అర్హులైన పేదలకు ఇంటి పట్టాలు మంజూరు చేయాలి

బద్వేలు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : బద్వేలు నియోజకవర్గ పరిధిలో ఉన్న అర్హులైన పేదలందరికీ ఇంటి పట్టాలు మంజూరు చేయాలంటూ సోమవారం సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో చంద్రమోహన్‌కు వినతి పత్రం ద్వారా విన్నవించారు. పీపీకుంట, టి.కొత్తపల్లె, భాకరాపేటలలో పేదవారు పూరిగుడిసెలు వేసుకుని నివసిస్తున్నారని వారికి వెంటనే ఇంటి పట్టాలు మంజూరు చేయాలని కోరారు. అర్హులైన ప్రతి పపేదవాడికి ఇంటిపట్టాలు మంజూరు చేస్తామని ఆర్డీవో పేర్కొన్నారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీరశేఖర్ , చంద్రశేఖర్, పట్టణ కార్యదర్శి బాలు, ఇమ్మానుయేల్, వెంకటరమణ, విజయలక్ష్మి పాల్గొన్నారు.

చిత్రం చెప్పిన సమస్య



పెద్దముడియం మండల పరిధిలోని మేడిదిన్నె-చిదిపిరాళ్లదిన్నె గ్రామాల మధ్య ఒక కల్వర్టుపై గొయ్యి ఏర్పడి ప్రమాదకరంగా మారింది. దీంతో రాత్రి సమయాలలో ఏమాత్రం అజాగ్రత్తగా వ్యవహరించినా ప్రమాదానికి గురికావాల్సిందే. ద్విచక్ర వాహనదారులతోపాటు ఆటోలు, కార్లు తదితర వాహనదారులు రోడ్డుపై వెళ్లాలంటే భయపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కల్వర్టు వద్ద ఏర్పడిన గొయ్యికి వెంటనే మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు. -పెద్దముడియం, (ఆంధ్రజ్యోతి)

ఓపెన్ ఇంటర్ పరీక్షా కేంద్రాల తనిఖీ



ఓపెన్ ఇంటర్ పరీక్షలను పరిశీలిస్తున్న డీఈవో షంషుద్దీన్

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఓపెన్ ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాలను జిల్లా విద్యాశాఖాధికారి షై. షంషుద్దీన్ తనిఖీ చేశారు. ఓపెన్ ఇంటర్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. డీఈవో మోడంపల్లె ఉర్దూ మున్సిపల్ హైస్కూలు, నారాయణ ఇంగ్లీషమీడియం స్కూలు, కొత్తకొట్టాలు మున్సిపల్ ఉర్దూ హైస్కూలులోని పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఇబ్బంది లేకుండా పరీక్షలు నిర్వహించాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లో కాపీలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కొత్తకొట్టాలు మున్సిపల్ ఉర్దూ పాఠశాలలో ఆలస్యంగా వచ్చిన విద్యార్థులను అనుమతించకపోవడంతో మానవతా దృక్పథంతో ఆ విద్యార్థులను పరీక్ష రాయడానికి అనుమతించాలని ఆదేశించారు.

జిల్లా కోఆర్డినేటర్‌ను విధుల నుంచి తొలగించాలి

జమ్మలమడుగు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఓపెన్ ఇంటర్ జిల్లా కోఆర్డినేటర్‌ను విచారించి విధుల నుంచి తప్పించాలని రాయలసీమ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జగన్, లింగమయ్య కోరారు. ఆ మేరకు సోమవారం జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయంలో ఏవో మనోహర్‌రెడ్డికి వారొక వినతి పత్రం అందజేశారు. వెంటనే జిల్లా ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత ఉండేలా చూడండి

ప్రొద్దుటూరు రూరల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గోపవరం గ్రామంలో ఉన్న జ్యోతినగర్‌లో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులలో నాణ్యత ఉండేలా చూడాలని మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బచ్చల పుల్లయ్య పేర్కొన్నారు. సోమవారం జ్యోతినగర్‌లో ఎంజీఎన్‌ఆర్‌సీసీ నిధులతో చేపట్టిన సిమెంటు పనులను ఆయన సందర్శించి అధికారులు, కాంట్రాక్టర్లతో పనుల నాణ్యతపై వాకబు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు శ్రీను, డీలర్ సుబ్బయ్య, ఆచారి, తదితరులు పాల్గొన్నారు.

మహిళా హక్కులపై అవగాహన పెంపొందించాలి



మహిళల బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న కమిషనర్, ఐసీడీఎస్ అధికారులు

ప్రొద్దుటూరు ,మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మహిళల హక్కులపై అవగాహన పెంపొందించాలని మున్సిపల్ కమిషనర్ వి. మల్లికార్జున పేర్కొన్నారు. సోమవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ వర్కర్లు బైక్ ర్యాలీ చేప ట్టారు. ఈ ర్యాలీని మున్సిపల్ కమి షనర్ మల్లికార్జున జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 8 జరిగే అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకోని వారంరోజుల పాటు మహిళా హక్కులపై చైతన్య కార్యక్రమాలు చేపట్టడం మంచిదన్నారు. ఐసీడీఎస్ సీడీపీవో హైమావతి మాట్లాడుతూ బాలికా విద్యను ప్రోత్సహించడం తదితర సమస్యలను చైతన్య పరిచే కార్యక్రమం చేపట్టామన్నారు. కార్యక్రమంలో మెప్మా సీఎంఎం మహాలక్ష్మీ, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేయాలి



కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహిస్తున్న ఐసీడీఎస్ అధికారులు, ఎంపీడీవో తదితరులు

పోరుమామిళ్ల మార్చి 3 (ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాలను అరికట్టాలని ఐసీడీఎస్ సీడీపీవో లక్ష్మిదేవి, ఎంపీడీవో రమణారెడ్డి పేర్కొన్నారు. ఈ నెల 8న జరగనున్న అంత ర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సోమవారం పోరుమామిళ్లలోని స్త్రీ శక్తిభవన్‌లో ఎంపీడీవో ఐసీడీఎస్ అధికారుల ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ఎం ఈవోలు బాల అంకిరెడ్డి, కాశయ్య, వెలుగు అధికారులు పాల్గొన్నారు.

కాశినాయనలో: తల్లి దండ్రులు ఆడపిల్లల పట్ల వివక్షత చూపకుండా మగపిల్లలతో సమానంగా పెంచాలని ఎంపీడీవో డాక్టర్ మైథిలీరెడ్డి, అంగన్‌వాడీ పర్యవేక్షకురాలు చంద్రకళ పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళాదినోత్సవ వారోత్సవాల్లో భాగంగా సోమవారం నర్సాపురంలోని వెలుగు కార్యాలయ సభాభవనంలో బేటీపడావో ...బేటీబచావో కార్యక్రమంలో భాగంగా కొవ్వొత్తులతో ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ముజఫర్ రహీం,అంగన్వాడీ కార్యకర్తలు,వెలుగు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఖాజీపేటలో: బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేయాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు భార్గవి, శ్రీదేవిలు పేర్కొన్నారు. సోమవారం మహిళా దినోత్సవ వారోత్సవాలను పురష్కరించుకుని బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్య వివాహాలపై అధికారుల దృష్టికి తేవాలన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జహరా, రమాదేవి, వెలుగు, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

గోపవరంలో : బాల్యవివాహాల నిర్మూలనే ప్రధాన లక్ష్యమని ఐసీడీఎస్ సూపర్‌వైజరు లక్ష్మీదేవి అన్నారు. మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించనున్న సందర్భంగా ఎంపీడీవో కార్యాలయం ప్రాంగణంలో సోమవారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు త్రిభువన్‌రెడ్డి, ఏపీఎం ప్రకాశ్, ఏడబ్ల్యుడబ్ల్యు కార్యకర్తలు సత్యవతి, విజయలక్ష్మి, సరస్వతి, ఏఎన్ఎం సుజాత, మహిళా పోలీసు, పంచాయతీ కార్యదర్శి విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

అట్లూరులో : మండలంలోని అంగన్‌వాడీ కేంద్రం వద్ద అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వేడుకలను సోమవారం స్థానిక సూపర్‌వైజరు విజయమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీడీవో భాస్కర్‌బాబు, ఎంఈవో విలియంరాజు, ఐసీడీఎస్ సూపర్‌వైజరు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు. బాల్యవివాహాలు నిర్మూలిద్దామంటూ సంతకాలు సేకరణ నిర్వహించారు.

ఎర్రగుంట్లలో: బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ సీడీపీవో ముంతాజ్ బేగం పేర్కొన్నారు. బాల్యవివాహాలపై మెప్మా, ఐసీడీయస్ కలిసి ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో మెప్మా సీవో వసంత్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, ఎస్‌హెచ్‌జీ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు రూరల్‌లో: పుస్తకాలు మోయాల్సిన వయస్సులో అభం శుభం తెలియని బాలికలపై పుస్తెల భారాన్ని మోపడం అమానుషమని ఎంపీడీవో సూర్యనారాయణరెడ్డి, ఐసీడీఎస్ సీడీపీవో అరుణకుమారి పేర్కొన్నారు. సోమవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల సందర్భంగా ఎంపీడీవో కార్యాలయంలో బాల్యవివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు.